మృత్యు తరంగాలు!

అజీజ్

"హలో, శ్రీలత స్పీకింగ్!"

"నేను విశాలక్షినోయ్! ఈ రోజు నా బర్త్ డే పార్టీ ఉందనీ, సాయంత్రం ఏడు గంటలకు మా ఇంటికి వేం చేయాలనీ అమ్మాయిగారికి గుర్తుంది కదా?" అవతలివైపు స్నేహితురాలి కంఠం విని, ముఖం చిట్లించింది శ్రీలత.

"అబ్బ, ఎన్నిసార్లు గుర్తుచేస్తావే తల్లీ! కనీసం ఇప్పటికి డజను సార్లైనా చెప్పుంటావు. మతిమరుపు నాకేం కాదు. నీకే ఉన్నట్టుంది. ఒక్కోసారి స్నేహితురాళ్ళ పుట్టిన రోజుల్ని నేనే వారికి గుర్తుచేసిన సందర్భాలున్నాయి తెల్సా? అందునా నీవంటి ప్రాణ సఖి బర్త్‌డే పార్టీకి నువ్వు పిల్చినా, పిలవకున్నా పిలవని పేరంటంలా రివ్వున ఎగిరి వాలనూ?"

"కదిపితే కందిరీగలా వాగడం ఆపవుకదా! ఇప్పుడు నీకు ఫోన్ చేసింది బర్త్‌డే జ్ఞాపకం చెయ్యడానికి కాదమ్మాయ్! ఆ పార్టీలో ఏర్పాటు చేయబోతున్న ఒక

అద్భుత ప్రదర్శన గురించి చెప్పడానికి!"

"ఏమిటా ప్రదర్శనా? కొంపదీసి నీ కథకళి ప్రదర్శన కాదు కదా? నాకు తెలీకుండా ఎప్పట్నించీ ప్రాక్టీస్ చేస్తున్నావే?"

"హాశ్శోస్మి! అందులో నాకు ఓనమాలు కూడా తెలియందే! నీ ఊహాగానాలు కట్టిపెట్టి, చెప్పేది విను. అస్సాం టీ ఎస్టేట్స్‌లో పెర్సనల్ ఆఫీసర్ గా పనిచేస్తున్న మా అన్నయ్య, దూరపు బంధువులే, ఈ రోజే మద్రాసు వచ్చాడు. అక్కడ బాగా అల్లర్లు జరుగుతున్నాయికదా, అందుకని.

ఆయనకు హిప్నాటిజంలో మంచి ప్రవేశం ఉందిట. ఈ రోజు పార్టీలో తన ప్రదర్శనా ప్రావీణ్యంతో అందర్నీ చకితుల్ని చెయ్యాలనుకుంటున్నాడట. అర్థమైందా? ఎన్ని అవాంతరాలు ఎదురైనా సరే, పార్టీకి రావడం మర్చిపోవద్దని అందరికీ తెల్పడానికే ఇలా ఫోన్ చేస్తున్నాను."

"అదా సంగతి. సరే, వస్తా. బెంగెట్టుకోక!"

అవతల నవ్వు, క్లిక్‌మన్న చప్పుడు.

రిసీవర్ దించి, రిస్టువాచీ చూసుకుంది శ్రీలత. మధ్యాహ్నం మూడున్నర. బజారుకెళ్ళి ఏదైనా మంచి ప్రెజెంటేషన్ కొనాలి. వచ్చి తయారయ్యేసరికి టైమైపోతుంది. అనుకుంటూ, డ్రెస్సింగ్ టేబిల్ మీద వేనిటీ బాగ్ అందుకుని బైటికి నడిచింది.

మేడ మెట్లు దిగి, హాల్లో అడుగుపెడుతుండగా, వదిన ఎదురై, "ఎక్కడికమ్మా లతా?" అంది.

"సాయంత్రం విశాలాక్షి బర్త్‌డే పార్టీ ఉంది వదినా! షాపింగ్ కెళ్తున్నాను. డ్రైవర్ వున్నాడా

బైటకి?”

“లేదు. ఇప్పుడే మీ అన్నయ్యను తీసికెళ్ళాడు కార్లో. నీ ఫియట్ రిపేరై వచ్చేసిందిగా, తీసికెళ్ళు.”

“హమ్మయ్య! ఇంకేం, వస్తానొదినా!” అంటూ హుషారుగా బైటికి నడిచింది లత. పోర్టికోలో ఆగివున్న తన ఫియట్ కారును చూడగానే ఆమె కళ్ళు మెరిశాయి. డ్రైవింగ్ సీట్లో కూర్చుని, స్టార్టుచేసి, ముందుకు పోనిచ్చింది.

2

రంగు రంగుల దీపతోరణాలతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది విశాలాక్షి ఇంటి ప్రాంగణం! కంపౌండ్లో అప్పటికే రకరకాల కార్లు వచ్చి, బారులుదీరి ఆగి వున్నాయి. తన కారును మెయిన్ గేటుగుండా లోనికి పోనిచ్చి, ఓ పక్క పార్క్ చేసి, పేకెట్ అందుకుని దిగింది శ్రీలత.

ఏడుకింకా రెండు నిమిషాలున్నాయి. వడివడిగా నడుస్తూ సింహద్వారాన్ని సమీపించింది. అక్కడ నిల్చుని, వస్తున్న అతిథులపై పన్నీరు చిలుకుతూ స్వాగతం పలుకుతున్నారు విశాలాక్షి తలిదండ్రులు. వారికి నమస్కరించి హాల్లో అడుగు పెట్టింది లత.

అప్పటికే అతిథులతో కిటకిటలాడుతోంది హాలు. అందులో కొందరు ఆమెకు బాగా పరిచయస్థులే. మరి కొందరు ముఖ పరిచయస్థులైతే, కొందరు అపరిచితులూ వున్నారు. ఓ యువకుణ్ణి వారికి పరిచయం చేస్తూ తిరుగుతున్న విశాలాక్షి దృష్టి శ్రీలతమీద పడగానే అతని చెయ్యి పట్టుకుని ఆమె దగ్గరికి లాక్కొచ్చి—

“నే చెప్పలా? ఈయనే మా అన్నయ్య రఘువీర్!

ఈమె నా స్నేహితురాలు శ్రీలత!" అంటూ పరస్పరం పరిచయం చేసింది.

చేతులు జోడించి నమస్కరించాడతను. సన్నగా పొడుగ్గా వున్నాడు. నొక్కుల జుత్తు నల్లపాంట్లో తెల్ల చొక్కా టక్ చేశాడు. కాళ్ళకి బూట్సు.

తొమ్మిదిన్నరకల్లా బర్తుడే తతంగం ముగిసింది.

ఆ తరవాత రఘువీర్ అతిథుల్ని ఉద్దేశించి తాను వారి మనోరంజనంకోసం ప్రదర్శించబోతున్న హిప్నాటిజం గురించీ, దాని ప్రాశస్త్యం గురించీ, ఈనాడు వైద్యరంగంలోనూ అది సంతరించుకుంటున్న ప్రాముఖ్యం గురించీ, వివరించి, తన ప్రదర్శనకోసం ఆ అతిథుల్లో శ్రీలతను ఎన్నుకోదలచినట్టు ప్రకటించగానే అందరూ చప్పట్లు చరిచారు బిగ్గరగా.

మరొకరైతే అలా తమ పేరు ప్రకటింపబడేసరికి భయంతోనో, మొహమాటంతోనో వెనుకంజ వేసేవారే! కానీ, సదా చలాకీగా నవ్వుతూ, నవ్విస్తూ ఉండే శ్రీలత ఏ మాత్రం అభ్యంతరం తెల్పకుండా నవ్వుతూ ముందుకు వచ్చింది.

రఘువీర్ ఓ కుర్చీ తెప్పించి, హాలుమధ్య వేయించాడు. అతిథులంతా ఆసక్తిగా ఆ కుర్చీని చుట్టుముట్టారు. శ్రీలతని ఆ కుర్చీలో కూర్చోమన్నట్టు సైగ చేశాడతను.

ఆమె కూర్చుంది.

"ఇప్పుడు కాస్త నా వైపు పరీక్షగా చూడండి!"

తలెత్తి అతని మొహంలోకి చూసింది శ్రీలత. అంతే! రఘువీర్ ఆమె కళ్ళల్లో కళ్ళు పెట్టి సూటిగా చూశాడు.

అంతవరకూ చిరు దరహాసం చిలికిస్తున్న శ్రీలత పెదవులు అకస్మాత్తుగా బిగుసుకుపోయాయి. వెన్నముకలో మంచుగడ్డ కరిగిపోతున్నట్టు తోచింది. అతని కళ్ళల్లో అనూహ్యమైన మెరుపు కానవస్తోంది

“మిస్ లతా! మీ కనురెప్పలు బరువెక్కుతున్నాయి. మస్తిష్కాన్ని నిద్ర మత్తు ఆవహిస్తోంది....మీరు పడుకుంటున్నారు....నిద్రపోతున్నారు....” అనసాగాడతను నిర్విరామంగా.

తనకు తెలీకుండానే కళ్ళు మూసుకుంది శ్రీలత. ఐనా, తను మేల్కొనే ఉన్నాననీ, నిద్రకు చాలా దూరంలో ఉన్నాననీ ఆమెకు తెలుస్తూనే వుంది. అతని మాటలు కూడా స్పష్టంగా వినిపిస్తూనే ఉన్నాయి.

“మీ కళ్ళు బరువెక్కుతున్నాయి....శరీరం దూది పింజలా తేలికవుతోంది....నిద్ర ముంచుకువస్తోంది మీకు. నిద్రలోకి జారిపోతున్నారు....గాఢ నిద్రలోకి....”

“లేదు! నేను నిద్రపోడంలేదు. మేల్కొనేవున్నాను. మీ మాటలు వింటున్నాను. నా చుట్టూ నిల్చున్న అతిథుల ఉనికికూడా స్పష్టంగా తెలుస్తూనే వుంది నాకు” అంది శ్రీలత చాలా నెమ్మదిగా.

అలా అన్నదే కానీ, తన శరీరంలో తనకే తెలీకుండా ఏదో పరివర్తన ప్రస్ఫుటమౌతున్నట్టు ఆమె గ్రహించకపోలేదు. హిప్నాటిజం గురించి అదివరకే తను కొన్ని వ్యాసాలు చదివింది పత్రికల్లో. హిప్నటైజ్ చెయ్యబడుతున్న వ్యక్తి మానసికంగా హిప్నాటిస్ట్‌తో సహకరించకుండా, దృఢచిత్తంతో ఉంటే అతను ఎట్టి పరిస్థితిలోనూ తన ప్రయత్నంలో సఫలం కాజాలడట!

అలాగే, తనూ మానసికంగా అతనితో సహకరించక,

అతని ప్రయత్నాలన్నీ చిత్తుచేసి, నలుగురిలో నవ్వుల పాలు చెయ్యాలి. అనుకుంటూ మనసును అదుపులో పెట్టడానికి ప్రయత్నించసాగింది.

ఐనా, అతని మాటలు వింటూ క్రమంగా ఆమె మనసు అదుపు తప్పుతూ అర్థసుషుప్తావస్థలోకి దిగజార సాగింది. అతనంటున్నట్టు ఇప్పుడు నిజంగానే తన శరీరం దూదిపింజలా తేలికవుతున్నట్టు అనుభూతి కలగసాగింది. కళ్ళు తెరవడానికెంత ప్రయత్నించినా అవి తెరుచుకో డానికి నిరాకరిస్తున్నాయి. కనీసం లేచి నిల్చుందామన్నా శరీరం లేవనుగాక లేవనంటూ మొరాయిస్తోంది!

ఇప్పుడు తను పూర్తిగా అతని దయాదాక్షిణ్యాల మీద ఆధారపడుతున్నట్టు అర్థమైపోయిందామెకు. ఏమిటీ మాయ?

“ఇప్పుడు మీరు పుస్తకం చదువుతున్నారు.... చాలా శ్రద్ధగా చదువుతున్నారు” అన్నాడతను ఆజ్ఞాపిస్తున్న ధోరణిలో.

ఆమె చేతులు అప్రయత్నంగా మొహం దగ్గరికి లేచాయి. పుస్తకం లేకున్నా చేతిలో పుస్తకం వున్నట్టే భ్రమిస్తూ, ఏమేమో పలవరించసాగింది.

“ఇప్పుడు టైప్ రైటర్ మీద ఉత్తరం టైప్ చేస్తున్నారు!”

ఆమెముందు టైప్ రైటర్ ఉనికేలేదు. ఐనా, టైప్ చేస్తునట్టు గాల్లో చేతివేళ్ళు ఆడించసాగింది.

“ఇప్పుడు గ్లాసులో నీళ్ళు తాగుతున్నారు.”

నిజంగానే నీళ్ళు తాగుతున్నట్టు పైకెత్తి నోటిమీదికి చెయ్యి తీసికెళ్ళింది లత. ఎంత కాదనుకున్నా అతని

ఆజ్ఞలు ధిక్కరించడానికి ఆమెకు శక్తి చాలడంలేదు. తన చేష్టలు చూపరులకు వింతగా తోస్తుండవచ్చనీ, వారు తనని తెలివితక్కువదానిగా భావిస్తుండవచ్చనీ ఆలోచిస్తూనే వుంది. ఆ ఆట అలా కొనసాగుతూనే వుంది!

"ఇప్పుడు మీరు నిద్రమత్తులోంచి మేల్కొంటారు... కళ్ళు తెరుస్తున్నారు జాగృదావస్థలోకి వస్తున్నారు.." అనసాగాడతను గంట తరవాత.

అంతవరకూ మెదడు నావహించిన మగత మబ్బులా విడిపోతున్నట్టూ. అవయవాలు మళ్ళీ తన అధీనంలోకి వస్తున్నట్టూ, స్ఫురించి, నెమ్మదిగా కళ్ళు తెరిచింది శ్రీలత. అంతే. అతిథులు చప్పట్లతో హాలు మారుమోగి పోయింది.

నవ్వుతూ లేచినిల్చుంది శ్రీలత. అతిథులు రఘువీర్ని చుట్టుముట్టి అభినందనలతోనూ, ప్రశ్నలతోనూ ముంచెత్తసాగారు.

అలా పదకొండు గంటలకు ముగిసింది పార్టీ!

అందరూ ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకుంటూ బైటికి నడవసాగారు. స్నేహితురాలివద్ద సెలవుతీసుకుని, తనూ బైటికి నడిచింది శ్రీలత. కాంపౌండ్లో ఆగివున్న కార్లు ఒకదాని వెనక ఒకటి స్టార్టవుతున్నాయి.

వాటిని తప్పుకుంటూ తన కారు ఆపివున్న చోటికి నడవసాగింది.

అంతలో — "లతగారూ!" అన్న పిలుపు విని, చటుక్కున వెనుదిరిగి చూసింది.

జగన్నాథం! నవ్వుతూ ఆమెని సమీపిస్తున్నాడు. ముఫ్ఫైఏడూ, ముఫ్ఫైఎనిమిదేళ్ళుంటాయతనికి. మామూలు

ఒడ్డూ పొడుగు. ఒళ్ళంతా కాటిక పూసినట్టు కారునలుపు. కందగడ్డలాంటి ముక్కు. మొహంమీద స్ఫోటకం మచ్చలు, ఓ పట్టాన దువ్వేనకు లొంగని బిరుసు జుత్తు. చీకట్లో ఎవరైనా చటుక్కునచూస్తే జడుసుకునే ఆకృతి అతనిది.

బూడిదరంగు ఫుల్ సూటు తొడిగి, మెడలో ఎరుపు రంగు టై కట్టుకున్నాడు. అతన్ని చూసినప్పుడల్లా భగవంతుడు ఎక్కడలేని కురూపాన్నంతా సమీకరించి, అతనికే సమర్పించాడా అనిపిస్తుంది శ్రీలతకు.

అందుకు భిన్నంగా అతని భార్యను చూస్తే మగవారి కళ్ళటుంచి, ఆడవారి కళ్ళే చెదిరిపోతాయి క్షణంపాటు! అంతటి అందగత్తె ఆమె.

అందుకే భార్యను ఎప్పుడూ తనవెంట యెక్కడికీ తీసికెళ్ళడు. ఆమె ముందు దిష్టిబొమ్మలా కనిపిస్తాడనో, లేదా పురుషుల కళ్ళు ఆమెని రెప్పవేయకుండా చూస్తుంటాయనో!

అటువంటి సౌందర్యవతి ఏరికోరి ఇలాంటి కురూపిని ఎలా కట్టుకుందా అని ఎవ్వరైనా ముక్కుమీద వేలేసుకోక మానరు. పేద పడుచులకు పెళ్ళిళ్ళు ముఖ్యంగానీ, వర అందచందాలతోనూ, వయసుతోనూ ఏమిటి పని?

జగన్నాథం ఐశ్వర్యవంతుడు. నగరంలో పేరుమోసిన ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ డీలర్. అతని ఐశ్వర్యం ముందు ఆమె ఆకలి తలవంచి వుంటుంది.

ఏది ఏమైనా ఆ భార్యాభర్తలిద్దరూ శ్రీలతకు సుపరిచితులే! జగన్నాథం అప్పుడప్పుడూ ఆమె అన్నయ్యతో బిజినెస్ వ్యవహారాలు చర్చించడానికి వారి ఇంటికి వస్తూ ఉంటాడు.

"ఎలా వుంది ప్రదర్శన? నచ్చిందా?" అడిగింది శ్రీలత అతను దగ్గరికి రాగానే.

"ఆ విషయమే మీతో మాట్లాడాలని ఆగాను. హిప్నటైజ్ చెయ్యబడుతున్నప్పుడు ఎలా ఫీలయ్యారు మీరు?" అడిగాడు జగన్నాధం కుతూహలంగా.

"చాలా ఆసక్తికరమైన ఆటలా తోచింది."

"నో, నో! వాస్తవాన్ని దాస్తున్నారు మీరు. ప్రదర్శన జరుగుతున్నంతసేపూ మీరు దాన్ని ప్రతిఘటించడానికి విశ్వప్రయత్నం చేసి విఫలమయ్యారు. అంతేకాదు, మీ ప్రవర్తనవల్ల ప్రేక్షకులు మిమ్మల్ని తెలివితక్కువదానిగా భావిస్తున్నారేమోనని తెగ బాధపడిపోయారు. ఔనా?"

ఆశ్చర్యంతో ఆమె కళ్ళు విప్పారాయి. "ఈ విషయాలు ఎలా తెలిశాయి మీకు?"

అతను చిన్నగా నవ్వి — "ఆ సమయంలో నేను మీలో ఉత్పన్నమైన భావాలను చాలా స్పష్టంగా చదవగలిగాను. హిప్నాటిజం గురించి నాకు బాగా తెలుసు. ప్రతి మనిషిలోనూ కొన్ని మహత్తర శక్తులు అంతర్గతంగా నిక్షిప్తమై ఉంటాయి. కొన్ని ప్రత్యేక సమయాల్లోనే అవి కట్టలు తెంచుకుని బహిర్గతమౌతుంటాయి.

మనుషులు నిత్య జీవితంలో తరుచూ పరస్పరం ఒకరి ఆలోచనలు ఒకరు చదవడానికి ప్రయత్నిస్తుంటారు. ఐతే, హిప్నాటిజం జరుగుతున్న సమయంలో అలా చదివే అంతర్గత శక్తి ప్రేరేపింపబడి ద్విగుణీకృతమౌతుంది. బహుశా, మనిద్దరి ఆలోచనా తరంగాల ఫ్రీక్వెన్సీ ఒకటే అయ్యుండాలి.

అందుకే నేను మీ ఆలోచనల్ని చాలా స్పష్టంగా ఆకళింపు చేసుకోగలిగాను. దాన్నేమంటారో తెలుసా?"

"ఏమంటారు?"

"టెలిపతీ?"

"టెలిపతా?"

"ఔను! ప్రదర్శన సమయంలో మీరు, 'అతనితో సహకరించకూడదు. ప్రతిఘటించాలి. అతని ప్రయత్నాలను చిత్తుచేసి నలుగురిలో నవ్వులపాలు చెయ్యాలి .... నా చేతిలో ఎటువంటి పుస్తకమూ లేదు.... నేను ఏ ఉత్తరాన్నీ టైపు చెయ్యడంలేదు....నీళ్ళు తాగడంలేదు....' అనుకోసాగారు. ఔనా?" అడిగాడు.

తన ఆలోచనల్ని అంత స్పష్టంగా విశదీకరిస్తున్న అతనివైపు ఆశ్చర్యంగా చూసింది శ్రీలత. ఐనా, వెంటనే తమాయించుకుని, "బహుశా, మీరు మారుతున్న నా ముఖ కవళికల్నిబట్టి ఇవన్నీ అంచనా వేసుకుంటారు" అంది కొట్టిపారేస్తూ.

"నో, నో! ఆ సమయంలో మీ మొహంలో యెటువంటి భావాలూ లేవు. చాలా ప్రశాంతంగా, భావ రహితంగా వుంది. కావలిస్తే ఎవరినైనా అడగండి. నాకే ఆశ్చర్యంగా ఉందిప్పుడు. మీ మనోభావాలనెలా చదవగలిగానా అని!"

అయోమయంలో శ్రీలత కనుబొమలు ముడిపడ్డాయి.

"భయపడకండి! ఇలాగే ఇకముందు కూడా మీ ఆలోచనల్ని ఎప్పుడుపడితే అప్పుడు ఎక్కడ చదువుతానో అని ఆందోళన పడుతున్నారు కదూ? అనవసరంగా ఒకరి వ్యక్తిగత విషయాలు తెలుసుకోడానికి ప్రయత్నించే కుసంస్కారిని కాను నేను."

"అది కాదు. ఇది ఎలా సంభవమా అని ఆలోచిస్తున్నానంతే!"

"సృష్టి వైచిత్ర్యాల్లో ఇదీ ఒక విచిత్రమే అనాలి! శాస్త్రజ్ఞులు కూడా ఎంతో కాలం ఈ విషయంమీద పరిశోధనలు జరిపి, ఇది సంభవమేనని నిర్ధారించి, దీనికి టెలిపతీ అని పేరు పెట్టారు!"

"సరే! ఈ క్షణంలో నేనేం ఆలోచిస్తున్నానో చెప్పండి చూద్దాం!"

జగన్నాథం క్షణంపాటు ఆమెని పరీక్షగా చూసి, "ఈ విధంగా మీ వ్యక్తిగత విషయాలూ, రహస్యాలూ మీవి కాకుండా పోతాయనీ, నావల్ల ముందు ముందు మీకు అనేక ఇబ్బందులు కలగవచ్చనీ ఆలోచిస్తున్నారు. ఔనా? ముందే చెప్పాను. నేనలాంటి మనిషిని కానని. ఇప్పుడు మీరు చెప్పండి. నేను మీ గురించి ఏం ఆలోచిస్తున్నాను?" అడిగాడు.

ఆశ్చర్యాన్ని అతికష్టంమీద అణగదొక్కుతూ, అతని కళ్ళల్లోకి చూసి, అతని మనోభావాలు చదవడానికి ప్రయత్నించింది శ్రీలత. మరుక్షణం ఆమె మొహం ఎరుపెక్కి కందగడ్డలా మారి, చటుక్కున చూపులు దించుకుంది. "మీరు....మీరు నన్ను ముద్దుపెట్టుకోవాలనుకుంటున్నారు!"

"సారీ, అలా ఆలోచించినందుకు. అందమైన అమ్మాయిని చూడగానే మగవారలాగే ఆలోచిస్తారండి! వస్తాను. ఉదయం ఫ్లైట్‌లో పనిమీద బొంబాయి వెళ్ళవలసి ఉంది నాకు. మీ అన్నయ్యను అడిగానని చెప్పండి" అంటూ ఇక ఆమెముందు నిల్చోలేక, తన కారువైపు నడిచాడు జగన్నాథం పట్టుబడ్డ దొంగలా.

తన కార్లో కూర్చుని. స్టార్టు చేసి, ముందుకు పోనిచ్చింది శ్రీలత. ఊహించని ఆ సంఘటనలో ఆమె మస్తిష్కం ఆలోచనారహితమైపోయింది చాలా సేపు. ఇంటికెళ్ళి పక్కమీద వాలిందేగానీ, ఆశ్చర్యాతిశయంతో ఓ పట్టాన నిద్రపట్టలేదామెకు.

3

"ఆంటీ .... ఆంటీ! నన్ను కార్లో పార్కుకు తీసి కెళ్లవూ?" ఆరేళ్ళ అన్నకొడుకు మురళి మారాం చేస్తోంటే కాదనలేకపోయింది శ్రీలత.

"అలాగే. తప్పకుండా తీసికెళ్తాను. బూట్లు తొడుక్కో మరి!" అంది వాడి బుగ్గలు చిదుముతూ.

"సాయంత్రం అవగానే ఇదో అలవాటై పోయింది వీడికి" అంటూ బూట్లు తెచ్చి తొడిగింది మురళి తల్లి.

శ్రీలత నవ్వి, వేళ్ళతో వాడి తల దువ్వి, "శభాష్! ఇక వెళదామా?" అంటూ ఎత్తుకోబోయింది.

"బాల్! నా బాల్!" అంటూ తుర్రుమని ఓ మూల పడున్న రంగురంగుల ఫుట్ బాల్ తీసుకొచ్చాడు. వాణ్ని ఫ్రంట్ సీట్లో పక్కన కూర్చోబెట్టుకుని, స్టీరింగ్ ముందు కూర్చుంది శ్రీలత. కారు స్టార్టు చేసి ముందుకుపోనిచ్చింది.

పావుగంటలో పానగల్ పార్కు చేరి, పార్కింగ్ ప్లేస్‌లో కారాపి దిగింది. ఇంకా పూర్తిగా చీకటిపడ లేదు. ఐనా, పార్కులో దేదీప్యమానంగా వెలుగు తున్నాయి ఫ్లోరోసెంట్ లైట్లు. బాలందుకుని కార్లోంచి బైటికి దూకాడు మురళి. పచ్చికబైలు మీద సాటి పిల్లలతో వాడు ఆడుకుంటోంటే చూసి ఆనందిస్తూ ఓ పక్క కూర్చుంది శ్రీలత.

గంట తరవాత లేచి, "ఇక వెళదామా?" అడిగింది.

అప్పటికే చీకటిపడింది బాగా. ఐనా, లైట్ల కాంతిలో పార్కు పట్టపగల్లా వెలిగిపోతోంది. మిగతా పిల్లల తలిదండ్రులు తమతమ పిల్లల్ని వెంటబెట్టుకుని వెళ్ళిపోతున్నారు.

"ఊఁహుఁ! ఇంకా ఆడుకుంటా!" అంటూ బంతిని కాళ్ళతో తంతూ ముందుకు సాగాడు మురళి. వాడి అభీష్టాన్ని కాదనడం ఇష్టంలేక, నెమ్మదిగా వాడి వెనకే నడవసాగింది లత.

అంతలో కుర్రాడు బంతిని ఈడ్చి తన్నాడు గట్టిగా. అది ఎగిరి దూరాన క్రోటన్స్ మొక్కల మధ్య పడింది.

"ఆంటీ, బాల్!" అన్నాడు మురళి అటు చూపుతూ.

"తెస్తానుండు" అంటూ గబగబ అటు నడిచింది లత.

వంగి, బాల్ అందుకుని తలెత్తింది. అంతే! శిలా ప్రతిమలా మళ్ళీ కదల్లేక పోయింది. క్రోటన్స్ కావలి వైపు కొద్దిదూరంలో యూకలిప్టస్ చెట్టు దగ్గర ఇద్దరు స్త్రీ పురుషులు కూర్చుని మాట్లాడుకుంటున్నారు ఏకాంతంగా.

ఆ స్త్రీ చెయ్యి పురుషుడి ఒళ్ళో వుంది. అతని చెయ్యి ఆమె భుజంమీద! మాటల మధ్య నవ్వుతూ ఆమె బుగ్గ మీద చిటికకూడా వేస్తున్నాడతను. అది పార్కు చివరి ప్రదేశం కావడంవల్ల అక్కడ అట్టే వెలుతురు లేదు. ఐతే, దూరాన వెలుగుతున్న ఓ ఫ్లోరోసెంట్ లైటు కాంతి కొద్దిగా ఆమెమీద పడుతోంది.

ఆ వెలుగులో ఆ స్త్రీని పోల్చుకున్న శ్రీలత దిగ్భ్రాంతితో నోరు తెరిచింది!

ఆమె ఎవరో కాదు.

జగన్నాథం భార్య! సులోచన!!

జుగుప్సతో చటుక్కున వెనుదిరిగింది లత. నిన్నరాత్రి తనతో టెలిపతీ గురించి మాట్లాడాక, ఈ రోజు ఉదయం ఫ్లైట్‌లో పనిమీద బొంబాయి వెళుతున్నానని చెప్పాడు జగన్నాథం!

భర్త ఊళ్ళోలేని సమయం చూసుకుని ఈవిడగారు పరపురుషుడితో....ఇదా సంగతి! పైకి అందంగా, అమాయకంగా కనిపించే ఈ స్త్రీలో ఇంతటి మాలిన్యమా!

ఆలోచిస్తూ కర్రాడు మారాం చేస్తున్నా వినకుండా ఇక ఒక్క క్షణం కూడా అక్కడుండలేక, వాణ్ణెత్తుకుని పార్కింగ్ ప్లేస్ వైపు నడిచింది శ్రీలత.

4

ఆ సంఘటన జరిగిన రెండురోజుల తరవాత రాత్రి తొమ్మిది గంటలకు అన్నా, వదినలతో కలిసి భోంచేసి, మేడమీద తన గదిలో కెళ్ళి ఓ ఆంగ్లపత్రిక తిరగేస్తూ సోఫాలో కూర్చుంది. భోంచేశాక ఓ గంటసేపు అలా ఏదో ఒక పుస్తకం చదివి, పక్కమీద వాలడం అల వాటు శ్రీలతకు.

రెండు పేజీలు తిరగేసిందో లేదో, అంతవరకూ బాగానే వున్న మెదడులో ఏదో సంచలనం ప్రారంభ మైనట్టు తోచి, వేళ్ళతో కణతలు అదుముకుంది. క్షణాలు గడుస్తున్నకొద్దీ ఆ సంచలనం సద్దుమణగడం అటుంచి, మరింత ఉధృతమై, ఈదురుగాలికి టెలిఫోన్ తీగలు పరస్పరం కొట్టుకుంటున్నట్టు శబ్దాలు ఉత్పన్నం కాసాగాయి.

పత్రికను ఒళ్ళో బోర్లించి, రెండు చేతులతో కణత లదుముకోసాగింది శ్రీలత. ఉన్నట్టుండి హఠాత్తుగా ఆమె మస్తిష్కపు తెరపై ఓ వింత దృశ్యం కాసేపు మసక

మసకగా కదులుతూ, క్రమంగా స్పష్టంకాసాగింది.

అది మీనంబాకం విమానాశ్రయం! ఆగి వున్న విమానంలోంచి, చేతిలో బ్రీఫ్ కేస్ పట్టుకుని మిగతా ప్రయాణీకులతో మెట్లుదిగుతున్నాడో వ్యక్తి. అంతర్నేత్రంతో అతన్ని శాస్త్ర పరీక్షగా చూసి, వెంటనే పోల్చుకుంది శ్రీలత.

అతను జగన్నాథం!

విమానం దిగి, వడివడిగా నడుస్తూ ఏర్ స్టేషన్ వెలపలి టాక్సీ స్టాండ్ చేరుకున్నాడు. చుట్టుముట్టిన టాక్సీ డ్రైవర్లని చీల్చుకుంటూ ఓ టాక్సీలో కూర్చున్నాడు. మరుక్షణం టాక్సీ కదిలి ముందుకు సాగింది.

కొన్ని రోడ్లు కట్ చేసి, నగరం మధ్య వున్న మేడ ముందాగింది. జగన్నాథం డ్రైవర్ కి డబ్బు చెల్లించి, కాంపౌండ్లోకి నడిచాడు. మూసివున్న తలుపు పక్క కాలింగ్ బెల్ బటన్ వత్తాడు. ఐదు నిమిషాలు దాటినా తలుపు తెరుచుకోలేదు.

చిరాకుతో మొహం చిట్లించి మళ్ళీ వత్తాడు. ఐనా, తెరుచుకోలేదు. తలుపు విసుగుతో దబదబ బాదాడు. ఈసారి లోపలినించి ఏవో మాటలు వినిపించాయి.

“నేను!” అన్నాడు కోపంగా.

తలుపు తెరుచుకుంది.

“మీరా!” సులోచన కంఠంలో వణుకు.

“ఏమిటలా గాభరాపడుతున్నావు? జరక్కూడనిదేదో జరిగిపోయినట్టు? రేపు రావలసింది ఈ రోజు వచ్చాను, అందుకేనా?”

“అ....అబ్బే....అది...కాదండీ....”

“ఏమిటా తడబాటు? నన్ను లోపలికి రానిస్తావా?

లేక పరాయివాడిలా బై టేనిల్చుని మాట్లాడమంటావా?"
చిరాకుతో ఆమెని పక్కకి నెట్టి, లోన అడుగు పెట్టాడు జగన్నాథం.

అంతే! సరిగ్గా అదే క్షణంలో షర్టు గుండీలు పెట్టుకుంటూ ఓ వ్యక్తి ఆదరాబాదరా లోపలినుంచి ఇవతలికి వచ్చాడు. ఊహించని ఆ సంఘటనతో జగన్నాథం చేష్టలుడిగి అతన్నే చూస్తుండిపోయాడు. ఆ వ్యక్తి బెదిరిన నక్కలా పరిగెత్తుతున్నట్లు నడుస్తూ కాంపౌండ్ గేటు దాటి, రోడ్డుమీద అదృశ్యమయ్యాడు.

"ఓహో! ఇదా నీ ఖంగారుకారణం!" అంటూ సులోచనవైపు తిరిగాడు జగన్నాథం.

"ఎన్నాళ్ళనించీ సాగుతోందీ వ్యవహారం?"

తలవంచుకుంది సులోచన!

మరుక్షణం ఛెళ్ళుమంది ఆమె చెంప!

అంతే! ఆ తరవాత శ్రీలత మస్తిష్కంలో మెదులుతున్న ఆ దృశ్యం మసకబారుతూ, క్రమంగా అదృశ్యమై పోయింది! జగన్నాథం చూస్తుండగా ఆ ఇంట్లోంచి బైటికి వచ్చిన వ్యక్తి ఎవ్వరో ఇప్పుడర్థమైందామెకు'

మొన్న పార్కులో సులోచన వెంట వున్న వ్యక్తి అతనే! ఇప్పుడామె రహస్యం భర్తముందు బట్టబయలై పోయిందా? రంగు చేతులతో పట్టుబడిందా? తన ఊహతో ఏమాత్రం ప్రమేయంలేకుండా సినిమా చూసినట్టు ఆ దృశ్యాలన్నీ తన మదిలో ఎలా కదిలాయి? ఏమిటీ విచిత్రం?

తామిద్దరి ఆలోచనా తరంగాల ఫ్రీక్వెన్సీ ఒకటేనని చెప్పాడు జగన్నాథం! అచ్చం టెలివిజన్ సిస్టంని పోలినట్టుందే ఈ మహేంద్రజాలమంతా! యెక్కడో

టి. వి. స్టూడియోలో వీడియో కెమెరాతో షూట్ అయ్యే ప్రోగ్రాం దృశ్యాలు వాయు తరంగాల్లో వెద జల్లబడి, ఎంటెనా ద్వారా గ్రహింపబడి టి.వి. తెరపై ప్రతిఫలిస్తూ ప్రేక్షకుల కంటికి కనబడతాయి.

అలాగే జగన్నాథం తన కళ్ళతో చూస్తున్న దృశ్యాలూ, చెవులతో వింటున్న శబ్దాలూ, వాయు తరంగాల్లో తేలి, సమాన ఫ్రీక్వెన్సీగల తనను చేరి, తన మెదడనే ఎంటెనా ద్వారా గ్రహింపబడి, మస్తిష్కమనే తెరపై ప్రతిఫలిస్తున్నాయా?

అలాగే, తను చూస్తున్న దృశ్యాలూ, వింటున్న శబ్దాలూ అతనూ గ్రహించగలడా? ఏమిటీమాయ? అదే నిజమైతే తన వ్యక్తిగత విషయాలన్నీ అరక్షణంలో అతనికి తెలిసిపోవూ? ఇదంతా నిజమేనా? లేక తన భ్రమా? ఈ విపత్తునించి ఎలా విముక్తి పొందాలి?

ఇటువంటి ఆలోచనలతో ఆ రాత్రంతా ఆమెకు నిదరపట్టలేదు పక్కమీద!

5

"అత్తా!"

"ఏం వదినా?"

"మీ అన్నయ్య ఫోన్ చేశారు. ఆఫీసునించి రాగానే తిన్నగా సినిమాకు వెళదామని!"

రిష్టువాచీ చూసుకుంది శ్రీలత. ఎనిమిదిగంటలు. "ఈ సమయంలో నా?"

"సెకండ్ షోకోసం టికెట్లు బుక్ చేయించారట. రేపు పనిమీద కలకత్తా వెళుతున్నారుగా, వారంరోజుల వరకూ రారట!"

"ఏ సినిమా?"

"శక్తి! దిలీప్ కుమార్, అమితాబ్ నటించిన హిందీ చిత్రం! అల్ఫా టాకీసులో!"

"సరే, తయారై వస్తాను" అంటూ మేడ మెట్లెక్కి తన గదిలోకెళ్ళింది శ్రీలత. జడ వేసుకుని, బట్టలు మార్చుకుంటే తయారైనట్టే. అనుకుంటూ డ్రెస్సింగ్ టేబిల్ ముందు కూర్చుని తల దువ్వుకోసాగింది.

సరిగ్గా ఆ దే సమయంలో ప్రారంభమయ్యాయి ఈదురు గాలులు ఆమె మస్తిష్కంలో! అప్రయత్నంగా జారి పడిపోయింది చేతిలోంచి దువ్వెన! కాసేపు తల తిరిగి నట్టు తోచి అద్దంలో కనిపిస్తున్న తన ప్రతిబింబం క్రమ క్రమంగా అదృశ్యమౌతూ, దాని స్థానే ఓ అస్పష్ట దృశ్యం ప్రత్యక్షమౌతున్నట్టు స్ఫురించసాగిందామెకు.

కళ్ళు చిట్లిస్తూ ఆ దృశ్యాన్ని పరీక్షగా చూడటానికి ప్రయత్నించింది. మబ్బు తెరలు తొలుగుతున్నట్టు ఇప్పుడా దృశ్యం స్పష్టంగా, చాలా స్పష్టంగా కనిపించ సాగింది అద్దంలో!

అది ఓ కారు విండ్ స్క్రీన్ డ్రైవింగ్ సీట్లో కూర్చుని, కారు డ్రైవింగ్ చేస్తున్నవారికి విండ్ స్క్రీన్ లోంచి రోడ్డు కనిపించే విధంగా కనిపిస్తోందా దృశ్యం! కారు హెడ్ లైట్స్ వెలుగు రోడ్డుమీద పడుతోంది. రోడ్డు కిరుపక్కలా యేపుగా ఎదిగి వున్నాయి చెట్లు. కారు చాలా నెమ్మదిగా సాగుతోంది ముందుకు. రోడ్డు మీద జనసంచారం లేదు.

కారు అలా కొంత దూరం వెళ్ళాక, అర ఫర్లాంగు దూరంలో రోడ్డుకడంపక్కన ఏదో తెల్లగా కదులుతూ కనిపించసాగింది. కారు క్రమంగా దగ్గరవుతున్నకొద్దీ అదేమిటో అర్థమైంది శ్రీలతకు. అది తెల్ల దుస్తుల్లో

వున్న ఓ స్త్రీ ఆకారం!

ఆ స్త్రీ చేతిలో ఓ సూట్ కేస్ వుంది. నీలిరంగు సూట్ కేస్! ఎవరికోసమో, లేదా ఏ కారుకోసమో అక్కడ నిల్చొని ఎదురుచూస్తున్నట్టు కనిపిస్తోందామె. ఐతే, ఆ కారు కోసం మాత్రంకాదని స్పష్టంగా తెలిసి పోయింది శ్రీలతకు.

కారణం ఎప్పుడైతే ఆమె తల తిప్పి ఇటు చూసిందో, మరుక్షణం ఆమె కళ్ళు భయంతోనూ, ఆశ్చర్యంతోనూ విప్పారాయి. అంతలో కారుకూ, ఆమెకూ చాలా దగ్గరి దూరం మిగిలిపోయింది. ఇప్పుడు కారు నడుపుతున్న వ్యక్తి హెడ్ లైట్స్ కాంతిలో ఆమెను స్పష్టంగా చూడగలుగుతున్నాడు.

ఆ స్త్రీ ఎవరో కాదు.

సులోచన!

కారు దగ్గరవుతున్నకొద్దీ ఆమె మొహం తెల్లగా పాలిపోసాగింది. కళ్ళల్లో ఖంగారు కొట్టవచ్చినట్టు కని పిస్తోంది. అలాగే, కారు నడుపుతున్న వ్యక్తి ఆలోచనా తరంగాలు కూడా శ్రీలత మనోఫలకం మీద ప్రతి ఫలించసాగాయి. అసహ్యం, క్రోధం, ప్రతీకారం, క్రూరత్వంతో కూడిన ఆలోచనలు!

నీకేం తక్కువ చేశాను? ఏం లోటు చేశానని ఇంతటి ద్రోహానికి పాల్పడ్డావ్? నీ బండారం బద్దలయ్యాక మళ్ళీ ఎప్పుడూ అటువంటి తప్పుడు పనులు చెయ్యకుండా బుద్ధిగా వుంటావని ఆశించాను. క్షమించి ఊరుకున్నాను. అందుకు భిన్నంగా ఇప్పుడు వాడితో లేచిపోవడానికి తయారయ్యావా? అపురూపంగా నీకోసం చేయించిన నగలూ, నగదూ ఆ సూట్ కేస్ లో నింపుకుని దొంగ

చాటుగా ఇల్లు వదిలి వస్తావా? నేను కురూపిననీ, ఎల్లప్పుడూ వ్యాపార గొడవల్లో మునిగి తేలుతుంటాననే కదూ నీ బరితెగింపుకు కారణం?

కురూపిని కావడం నా నేరమా? రాత్రింబవళ్ళూ కష్టపడుతోంది నీకోసం కాక మరెవరికోసం? సరే, ప్రేమించేవారిని ప్రేమించడం, ద్వేషించేవారిని ద్వేషించడం మానవ నైజం! నువ్వు నన్ను ఏవగించుకుంటున్నప్పుడు నిన్ను నేనెందుకు ప్రేమించాలి?

నా కష్టార్జితంతో, నీకిష్టమైనవాడితో రహస్యంగా లేచిపోదామని నిర్ణయించుకున్నావు కదూ? అలాగే నేనూ ఒక నిర్ణయానికి వచ్చానిప్పుడు. ఇక వాడితో ఎక్కడికీ పోలేవు నువ్వు, పరలోకానికి తప్ప!

అంతే! మరుక్షణం కారు స్పీడ్ హెచ్చింది. శరవేగంతో ఆమెని, సమీపించసాగింది. ఆ హఠాత్పరిణామానికి ఆమె హడలిపోయింది. బాణంలా తన మీదికి దూసుకువస్తున్న కారును తప్పించుకోడానికి నాలుగడుగులు వెనక్కి వెయ్యబోయి, ఫుట్ పాత్ అడ్డుతగిలి తడబడింది.

ఆ తడబాటుతో ఆమె చేతిలో వున్న సూట్ కేస్ జారి కిందపడింది. మరుక్షణం ఆమె గావుకేక పెడుతూ వెనుదిరిగి రోడ్డుపక్క చెట్లవైపు పరుగులు తీసింది. ఆ చెట్ల నడుమ కంచెలా ఎదిగి వున్న ముళ్ళ పొదలు అడ్డు లేకుంటే, బహుశా తప్పించుకునేదేమో!

వాటిని చూడగానే, ఒక్కసారి ఆగి, కారువైపు తిరిగింది. ప్రాణభీతితో అతన్ని వేడుకుంటున్నట్టు రెండు చేతులూ ఎత్తి జోడించింది. ఐనా, కారు స్పీడ్ తగ్గ

లేదు. జరగబోయేదేమిటో ఆమెకు తెలిసిపోయినట్టు గొంతుపార చిరిగేలా గావుకేక పెట్టింది.

అప్పటికే, జరగవలసింది జరిగిపోయింది. మరో భయంకరమైన కేక కారు శబ్దంలో కలిసిపోయింది. చక్రాలకింద ఏదో అడ్డు తగిలినట్టు ఆరంగుళాలు పైకెగిరి పడింది కారు. ఇక ఆ దృశ్యం చూడలేక చటుక్కున కళ్ళపై చేతులు కప్పుకుంది శ్రీలత.

పెదాలు వణికాయి అప్రయత్నంగా, "భగవంతుడా! ఏమిటిదంతా?"

అంత చలిలోనూ ఆమె నుదుటిపై అసంఖ్యాకమైన స్వేదబిందువులు పేరుకుంటున్నాయి నెమ్మదిగా!

అంతలో భుజంమీద ఏదో మెత్తగా తగిలి, తృళ్ళిపడి కళ్ళు తెరిచింది.

అద్దంలో అంతవరకూ కనిపించిన దృశ్యం మాయం! ఆ స్థానే వదిన రూపం కనిపించింది. "ఏం జరిగింది లతా! ఎందుకలా వున్నావ్?"

"ఏం లేదు వదినా తల నెప్పిగా వుంది. మీరు వెళ్ళి రండి సినిమాకు. టాబ్లెట్ వేసుకుని పడుకుంటాను."

"నిన్ను విడిచి మేమెలా వెళ్ళేది? మీ అన్నయ్యరానీ, యేమంటారో చూద్దాం! అలా పడుకో, విక్స్ రుద్దుతాను" అంది వదిన టేబిల్ సొరుగులాగుతూ.

6

రాత్రి బాగా పొద్దుపోయేవరకూ తీవ్ర మానసిక ఒత్తిడితో బాధపడి, నిద్రమాత్రలు మింగి పడుకున్న శ్రీలత, ఉదయం కళ్ళు తెరిచిచూస్తే టీపాయ్‌మీది టైంపీస్ పదిగంటలు చూపెడుతోంది.

నెమ్మదిగా లేచి కూర్చుంది. బాగా నిద్రపోవడంవల్ల

ఇప్పుడు శాస్త్ర రిలాక్స్‌గా వుంది ఒళ్ళు.

"లేచావా లతా? ఒంట్లో ఎలా ఉందిప్పుడు? రెండు మూడుసార్లు వచ్చి చూశాను బెడ్ టీ ఇద్దామని" అంటూ గదిలోకి వచ్చింది వదిన.

"తలపోటు పూర్తిగా తగ్గిపోయింది వదినా! థాంక్స్. అన్నయ్య వెళ్ళాడా?"

"ఇందాకే వెళ్ళారు ఏర్ పోర్టు! మురళి ఓ పట్టాన వదల్లేదనుకో. నిన్ను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి మరీ వెళ్ళాడు. తొమ్మిదిన్నరకు ఉందిట కలకత్తా ఫ్లయిట్. కూర్చో టీ పట్టుకొస్తాను" అంటూ బైటికి నడిచింది వదిన.

పదహారేళ్ళ ప్రాయంలో తలిదండ్రుల్ని కోల్పోయిన తనకు వారి లోటు ఏమాత్రం తెలీనివ్వకుండా చూసుకుంటున్న అన్నావదినలంటే శ్రీలతకు పంచప్రాణాలు.

వదిన అందించిన టీ తాగి, కాలకృత్యాలు తీర్చుకుని, డైనింగ్ టేబిల్ ముందు కూర్చోగానే వేడివేడి ఇడ్లీల ప్లేటు ప్రత్యక్షమైంది. కొబ్బరి చెట్నీతో ఇడ్లీలారగించి, కాఫీ తాగగానే పేపర్ తెచ్చి ముంచుంచాడు నౌఖరు.

పేపరు తిరగేస్తున్న శ్రీలత కళ్ళు ఓ వార్త మీద నిలిచాయి.

'రోడ్డు ప్రమాదంలో స్త్రీ దుర్మరణం!'

మద్రాసు, ఆగస్టు, 25:—గతరాత్రి ఎనిమిదిగంటలకు విజయరాఘవాచారి రోడ్లో సుమారు ఇరవైఎనిమిదేళ్ళ అందమైన స్త్రీని గుర్తుతెలియని వాహనం ఢీకొనగా ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.

మనుష్య సంచారం అంతగా వుండని ఆ రోడ్లో రాత్రి విపరీతమైన చలివల్ల పూర్తిగా నిర్మానుష్యమై

ఉండాలని, అందుకే ఆ దుర్ఘటనను ఎవ్వరూ చూడలేక పోయారనీ పోలీసుల ద్వారా తెలిసింది.

వారి విచారణలో హతురాలి పేరు సులోచన అనీ, ఆమె భర్త శ్రీ జగన్నాథ్ నగరంలో పేరుమోసిన ఆటో మొబైల్ స్పేర్ పార్టు డీలరనీ తెలిసింది. ఆ దుర్ఘటన జరిగిన సమయంలో ఆయన పాండీబజార్లోని తన మెయిన్ బ్రాంచి ఆఫీసులో వున్నాడట. తన భార్య ఆ సమయంలో ఒంటరిగా కాలినడకన ఆ రోడ్డువెపు ఎందుకు వెళ్ళిందో తనకు తెలీదని పోలీసులతో చెప్పాడాయన.

ప్రత్యక్ష సాక్ష్యులు లేని కారణంగా శ్రీమతి సులోచన మరణానికి కారణమైన ఆ వాహనాన్ని కనుగొనడం పోలీసులకు పెద్ద సమస్యగా మారింది. ఐనా, వారు అధైర్యపడక తమ విచారణ కొనసాగిస్తున్నారు.

ఆ వార్త చదివాక దిగ్భ్రాంతితో చేష్టలుడిగి చాలా సేపు అలాగే కూర్చుండిపోయింది శ్రీలత. ఆ ఘటనా స్థలంలో ప్రత్యక్ష సాక్ష్యులెవ్వరూ లేకపోయినా, ఎంతో దూరంలో ఉండికూడా తాను ప్రత్యక్షంగా చూసిందా దృశ్యాన్ని.

పోలీసులూ, పత్రికలవారూ దాన్ని సాధారణ రోడ్డు ప్రమాదంగా భావిస్తున్నా, అది పదహారిణాల పచ్చి హత్య అని తనకు తెలుసు. అంతేకాదు, ఆమెను హత్య చేసింది మరెవ్వరో కాదనీ, స్వయాన ఆమె భర్త జగన్నాథమేనని కూడా తనకు బాగా తెలుసు.

పోలీసులు దాన్ని రోడ్డు ప్రమాదంగా భావిస్తే, హంతకుడు చట్టం చేతుల్లో పడకుండా చాలా సులభంగా తప్పించుకోగలడు. అతని భార్య నీతిమాలినదే

కావచ్చు. నమ్మకద్రోహం కావచ్చు. అంతమాత్రాన ఆమె నిండు ప్రాణాలు బలి తీసుకునే హక్కు అతని కెవరిచ్చారు?

అటువంటి నీతిబాహ్యురాలిని వదిలించుకోడానికి విడాకుల రూపంలో చట్టపరంగా సులభతరమైన మార్గం ఉండగా అటువంటి దారుణానికి ఎందుకు పాల్పడాలి? వీల్లేదు! అతను చట్టంనించి తప్పించుకోడానికి వీల్లేదు.

అది హత్య అనీ, హంతకుడు అతనేననీ తెలిసికూడా తను నోరు మూసుక్కూర్చుంటే, జీవితాంతం తన అంతరాత్మ తనని క్షోభపెట్టక మానదు. వెళ్ళాలి. పోలీసుల దగ్గరికి వెళ్ళి అంతా చెప్పేయ్యాలి. కనీసం ఆ విధంగానైనా వారికి సరైన సూచన దొరుకుతుంది. జగన్నాథం వారి దృష్టిలో పడతాడు. అనుకుంటూ లేచి నిల్చుంది.

7

"ఇన్‌స్పెక్టర్ యుగంధరరెడ్డిగారు ఉన్నారా?"

"ఉన్నారు. అదుగో, అదే ఆయన ఆఫీసురూం!" చెప్పాడు ఓ సబ్ఇన్‌స్పెక్టర్ వేలితో ఓ గది చూపుతూ.

అది క్రైంబ్రాంచి హెడ్‌క్వార్టర్స్!

అతను చూపిన గదివైపు నడిచింది శ్రీలత. స్ప్రింగ్ డోర్స్ మూసి వున్నాయి. తలుపు పక్కన గోడకు బిగించి వుంది నేమ్ ప్లేట్.

'ఇన్‌స్పెక్టర్ యుగంధరరెడ్డి.'

"మే ఐ కమిన్ సర్?" అడిగింది తలుపు ముందాగి.

"ఎస్ ప్లీజ్!" వినిపించింది లోపలినించి.

స్ప్రింగ్ డోర్స్ తీసుకుంటూ లోన అడుగుపెట్టింది శ్రీలత.

ఇన్‌స్పెక్టర్ క్షణంపాటు ఆమెని పరీక్షగా చూసి,

"కూర్చోండి" అన్నాడు.

అతని ముందున్న కుర్చీలో చతికిలబడింది.

"చెప్పండి. ఏం పనిమీద వచ్చారు?"

కంఠం సవరించుకుని, మొదటినించీ చివరివరకూ అంతా పూసగుచ్చినట్టు చెప్పి, "తరుచూ పత్రికల్లో మీ పేరు చదువుతుంటాను. ఆ కేసు ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో, దాని గురించి ఎవరు విచారణ జరుపుతున్నారో నాకు తెలీదు. అందుకే మీ వద్దకు వచ్చాను" అంది శ్రీలత.

ఇన్‌స్పెక్టర్ పలకలేదు. ఆమె చెప్పింది విని, రెండు నిమిషాలు ఆమెని పరీక్షగా చూడసాగాడు. అతని కళ్ళల్లో తనపట్ల అనుమానం, సందేహం ద్యోతకమౌతున్నట్టు పసిగట్టింది శ్రీలత. కొంపదీసి అతను తన కథనం విని, తనకు మతిస్థిమితం లేదని అనుమానించడం లేదుకదా?

సాలోచనగా తలూపాడు ఇన్‌స్పెక్టర్. "నా సర్వీసులో ఇంతవరకూ ఎక్కడా ఎప్పుడూ కనీ వినీ ఎరగని చిత్రమైన విషయమిది. నమ్మాలా వద్దా అన్న మీమాంసలో పడిపోతున్నాను. మీరు నన్ను కలుసుకోడం ఒకవిధంగా మంచిదే అయింది!"

"ఔను. ఈ విధంగా పోలీసుల పరిశోధనకు సరైన ఆధారం లభిస్తుందని ఆశించి వచ్చాను. రోడ్డుమీద నడిచేవారిని గుద్దేసి, ప్రమాద స్థలంలో ఆగకుండా పారిపోయే వాహనాల గురించి తరుచూ పత్రికల్లో చదువుతూనే ఉంటాం!

అటువంటి సంఘటనలు జరిగినప్పుడు సాధారణంగా ఆ వాహనాల హెడ్‌లైట్సో, బంపర్సో లేదా బాడీ ఇతరచోటా సొట్టలు పడటం జరుగుతూ ఉంటుంది.

ఒకసారి జగన్నాథం గారును పరీక్షిస్తే అసలు విషయం మీకర్థమౌతుందనుకుంటాను."

"సరే, పెర్సనల్ గా ఈ విషయంలో నేను ఇంట్రెస్టు తీసుకుంటాను. ఐతే, కోర్టులో జగన్నాథం తన భార్యను చంపడానికిగల నిర్దుష్టమైన కారణం చూపవలసి ఉంటుంది. అందుకు ఆ రోజు సాయంత్రం పానగల్ పార్కులో అతని భార్యవెంట వున్న వ్యక్తి యెవరో కనుక్కోడం చాలా అవసరం!

భర్త కన్నుగప్పి సులోచన ఆ వ్యక్తితో సంపర్కం పెట్టుకున్నందుకే, ఆ సంగతి తెలిసిన జగన్నాథం ఆమెను చంపేశాడని కోర్టువారిని నమ్మించాలి. యెవరతను? ఎక్కడుంటాడు? అతన్ని మళ్ళీ మీరు చూస్తే గుర్తుపట్టగలరా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

పెదవి విరిచింది శ్రీలత. "సారీ! పానగల్ పార్కులో అతన్ని అంత పరీక్షగా చూడలేకపోయాను. కారణం వాళ్ళిద్దరూ పార్కు చివర మసకచీకట్లో కూర్చున్నారు. దూరాన వెలిగే ఫ్లోరోసెంట్ లైటు కాంతి కొద్దిగా సులోచనమీద పడుతోంది. ఆమెనే చూడగలిగాను పరీక్షగా.

ఆ మర్నాటి రాత్రి ఇంట్లో వుండగా నా మనస్సు తెరపై జగన్నాథం విమానం దిగి, టాక్సీలో ఇంటికి వెళ్ళడం, కాలింగ్ బెల్ నొక్కడం, తలుపు తెరుచుకోడం, అతన్ని చూడగానే సులోచన బెదిరిపోవడం, అదే సమయంలో ఇంట్లోంచి ఆ వ్యక్తి బిత్తర చూపులు చూస్తూ బైటికివచ్చి చరచరా వెళ్ళిపోడం మొదలైన దృశ్యాలు కనిపించినప్పుడు కూడా అతన్ని నేను పరీక్షగా చూడలేకపోయాను. ఇప్పుడేం చేయ్యాలి?

అతన్ని ఎక్కడ వెదకాలి?"

"అదంతా నేను చూసుకుంటాను. మీ చిరునామా ఇచ్చి వెళ్ళండి, ఏమైనా తెలిస్తే ఫోన్ చేసి చెబుతాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నోట్‌బుక్ తెరుస్తూ.

తన చిరునామా చెప్పి, "దయచేసి ఎట్టి పరిస్థితి లోనూ నేను మిమ్మల్ని కలుసుకున్న సంగతి జగన్నాథానికి తెలియనివ్వకండి. అంతేకాదు, పత్రికల వారికి కూడా! జగన్నాథాని కటుంచి, లోకానికంతా నా గురించి తెలిసిపోతుంది.

నిజానికి ఉదయం పత్రికలో సులోచన మరణవార్త చదవకుండా వుంటే అంతవరకూ నా కళ్ళల్లో కదిలిన ఆ విచిత్ర దృశ్యాలన్నీ కేవలం నా భ్రమగానే భావించే దాన్ని. ఐతే, నేను సులోచన చేతిలో చూసిన నీలి రంగు సూట్‌కేస్ గురించి పత్రికలో ఎలాంటి ప్రస్తావనా లేదు. బహుశా, ఆమె చనిపోగానే జగన్నాథం ఆ సూట్‌కేస్‌ని తన వెంట తీసికెళ్ళాడేమో!" అంది శ్రీలత.

"ఆ విషయం కూడా ఆరాతీస్తాను. ఇకమీరు వెళ్ళి రండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నోట్‌బుక్‌లో వివరాలు రాసుకుంటూ.

శ్రీలత లేచి, నమస్కారం పెట్టి, బైటికి వచ్చింది. ఇక పోలీసులు ఏం చేసినా, చెయ్యకున్నా తనకు నిమిత్తం లేదు. తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తించింది. అనుకుంటూ కారెక్కి, తిన్నగా ఇంటివైపు పోనిచ్చింది.

8

"శ్రీలత స్పీకింగ్!"

"నేను యుగంధరరెడ్డిని మాట్లాడుతున్నాను."

"చెప్పండి సార్! ఏమైనా తెలిసిందా?"

"తెలిసింది. హెడ్ క్వార్టర్స్ కి వచ్చి నన్ను కలుసుకోండి చెబుతాను వివరాలు."

"ఇప్పుడే వస్తున్నా!" అంటూ రిసీవర్ క్రేడిల్ చేసి, రిస్టువాచీ చూసుకుంది శ్రీలత. సాయంత్రం ఐదుగంటలు. కారెక్కి హుటాహుటిన క్రైంబ్రాంచ్ హెడ్ క్వార్టర్స్ చేరుకుంది.

ఆమెని చూడగానే కూర్చోమన్నట్టు సైగ చేశాడు ఇన్ స్పెక్టర్. "ఆ కేసు పరిశోధిస్తున్న ఇన్ స్పెక్టర్ వెంట నేను జగన్నాథం ఇంటికెళ్ళి, ఒకసారి అతని కారు చూడాలని కోరాను.

గారేజ్ లోకి తీసికెళ్ళి చూపాడు. అది కారుకాదు. జోంగా జీవ్! అతను కారు వాడడట! ఆ జీవ్ ను జాగ్రత్తగా పరిశీలించాం! దాని బంపర్, ఛేసిస్ ఫ్రేం చాలా బలిష్టమైనవి. అది మనిషిని ఢీకొన్నా, పెద్ద చెట్టును ఢీకొన్నా వీసమెత్తు సొట్ట పడదు!"

"మరి ఆ సూట్ కేస్ సంగతి?" అడిగింది శ్రీలత నిరుత్సాహంగా.

"దాన్ని గురించికూడా అతన్ని ప్రశ్నించాం! తన భార్యవద్ద అటువంటి సూట్ కేస్ ఏదీ లేదనీ, ఆమె తన బట్టలూ, సామానూ పెద్దసైజు లెదర్ కేసుల్లోనూ, గోద్రెజ్ బీరువాలోనూ పెట్టుకుంటుందని చెప్పాడు!"

"సులోచన చేతిలోంచి ఆ సూట్ కేస్ కిందపడగానే జీవ్ గుద్దేసింది ఆమెను. బహుశా, దానిమీద ఆమె రక్తపు మరకలు కూడా పడుండాలి. అందుకే అతను దాన్ని తనవెంట తీసికెళ్ళి, ఆధారం లేకుండా ఎక్కడైనా పారేశాడేమో! లేదా, తన ఇంట్లోనే ఎక్కడో

దాచేశాదేమో! ఒకసారి ఆ ఇల్లు సోదా చేస్తే బావుండేది."

పెదవి విరిచాడు ఇన్స్పెక్టర్. "ఒకరి ఇల్లు సోదా చెయ్యడం అంత సులభంకాదు. కోర్టుద్వారా సెర్చి వారెంట్ పొందాలి. అంతేకాదు, ఆ ఇల్లు ఎందుకు సోదా చెయ్యదలచామో కారణాలతోసహా వివరించాలి కోర్టుకు!

మీరు చెప్పిన వివరాలు ఉదహరిస్తే మేజిస్ట్రేట్ మమ్మల్ని పిచ్చివాళ్ళకింద జమకట్టవచ్చు. ప్రపంచంలోని ఏ కోర్టూ మిమ్మల్ని ప్రత్యక్ష సాక్షిగా అంగీకరించదు. కారణం, ఆ సమయంలో మీరు ఆ ప్రదేశానికి ఎంతో దూరంలో ఉన్న మీ ఇంట్లో వున్నారు!"

"ఐతే, ఇక ఈ విషయంలో మీరేమీ చెయ్యలేనంటారా?"

"సారీ, అయామ్ వెరీ సారీ!" అన్నాడు ఇన్స్పెక్టర్ సానుభూతిగా.

"సరే, వస్తాను. సెలవు!" అంటూ లేచి బైటికి వచ్చేసింది శ్రీలత. కారెక్కి ఇల్లుచేరేసరికి వదిన ఎదురైంది. "ఎక్కడికెళ్ళావు లతా? ఈమధ్య నీకు మతిమరుపు వచ్చేసినట్టుంది. వెళ్ళేటప్పుడు వదినకు చెప్పడం కూడా మర్చిపోతున్నావు. రా, కాఫీ తాగుదువుగాని. సాయంత్రం టిఫిన్లో నీకిష్టమైన ఉల్లి పకోడీలు వేయించాను."

"సారీ వదినా! విశాలక్షి వెంటనే రమ్మని ఫోన్ చేస్తే వెళ్ళాను" ఏమనాలో తోచక బొంకింది శ్రీలత.

"ఎందుకు పిలిచిందట?"

"అచ్చే, కొత్త బట్టలు కొనడానికి బజారుకెళ్తూ,

సెలక్షన్ కోసం నన్ను తోడు రమ్మంది. అంతే!" ఒక అబద్ధాన్ని సమర్థించుకోడానికి మరో అబద్ధాన్ని జోడించక తప్పదు మరి.

"సర్లే, పద, టిఫిన్ చేద్దువుగాని!"

తినాలని లేకున్నా, కదిన నొచ్చుకుంటుందని, నాలుగు పకోడీలు నమిలి, కాఫీ తాగి తనగదిలోకెళ్ళి, ఉన్నూరు మంటూ సోఫాలో చతికిలబడింది.

అంతే! తుఫానుగాలులు ప్రారంభమయ్యాయి తలలో!

ఎంత ఉధృతంగా ప్రారంభమయ్యాయో, అంత సద్దుమణగసాగాయి. మరుక్షణం ఆమె మనిష్క పు ట్రాన్స్మీటర్ ఓ సుపరిచిత కంఠాన్ని రిసీవ్ చేసుకో సాగింది.

'సందేహంలేదు....శ్రీలత పోలీసులకు చెప్పి వుంటుంది....ఆమెకు తప్ప....సులోచన....మరణ రహస్యం మరెవ్వరికీ....తెలిసే....అవకాశంలేదు....'

జగన్నాథం ఆలోచనా తరంగాలవి!

అంతవరకూ సజావుగా కొట్టుకుంటున్న ఆమె గుండెలో ఇప్పుడు దడ ప్రారంభమైంది! ఇన్స్పెక్టర్ యుగంధర రెడ్డి అతనింటికెళ్ళి అతని జీవుతు పరిశీలించి, సూట్ కేస్ గురించి ప్రశ్నించగానే పోలీసులకు తనమీద అనుమానం కలిగించడానికి మూలకారణం ఎవరో సులభంగానే అర్థమై వుంటుందతనికి.

లేదా, మొదటినించీ అతను తన ఆలోచనల్ని చదువుతున్నాడేమో! ఇప్పుడేం చెయ్యాలి? తన భయం చివరికి నిజమే అయింది. జగన్నాథం ఏంచేస్తాడు? తన మీద ప్రతీకార చర్యకు పూనుకుంటాడా? ఒక నిందు

ప్రాణిని బలిగొనడానికి బరితెగించినవాడు. సాక్ష్యాన్ని నిర్మూలించడానికి మరో ప్రాణం తియ్యకుండా ఊరుకుంటాడా?

ఆ ఆలోచన రాగానే శ్రీలత వెన్నుముకలో సన్నగా వణుకు ప్రారంభమైంది. తన భయాందోళనలని ఎవరి ముందు చెప్పుకోవాలి? ఎవరు నమ్ముతారు? పోలీసులైతే ముందే నిరాకరించారు నమ్మడానికి. వదిన నమ్ముతుందా? ఏమో! నమ్మడానికి బదులు తనకు పిచ్చి పట్టిందని భయపడి, ఏ పిచ్చాసుపత్రికో తీసికెళ్తే?

సమయానికి అన్నయ్య కూడా లేడే ఊళ్ళో! ఏం చెయ్యాలిప్పుడు .... ఆc! కొన్నాళ్ళు ఈ ఊరొదిలి ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోతే? ఆ విధంగా జగన్నాథం ఆలోచనలు తనదరి చేరకుండా జాగ్రత్తపడితే, క్రమంగా అతను తనని మర్చిపోవచ్చు. పరిస్థితి మళ్ళీ మామూలు స్థితికి రావచ్చు!

ఆ ఆలోచన రాగానే మద్రాసుకు వందమైళ్ళ దూరంలో వున్న తిరవాన్మూర్ అనే ఊరు జ్ఞాపకం వచ్చింది శ్రీలతకు. అది తన మేనత్త ఊరు. అపార ఆస్తిపాస్తులకు వారసుడైన ఆమె ఒక్కగా నొక్క కొడుక్కి తననిచ్చి పెళ్ళి చెయ్యాలని అన్నయ్య సంకల్పం!

పెద్దల మధ్య ఆ నిర్ణయం ఎప్పుడో జరిగిపోయింది కూడా! వచ్చే ఏడు తన ఎమ్.ఏ. పరీక్షలు పూర్తి కాగానే.... శ్రీలత బుగ్గలు ఎరుపెక్కాయి సిగ్గుతో. అక్కడ బావ అండ ఉండగా ఏ గండమూ తన దరి చేరదు. సురక్షితంగా వుండవచ్చు.

అనుకుంటూ ఓ నిర్ణయానికి వచ్చి, రాత్రి భోజనాల

సమయంలో వదినముందు ఆ ప్రస్తావన కదిపింది శ్రీలత.

"కాలేజీలు తెరవడానికింకా ఇరవై రోజులున్నాయికదా, ఒకసారి అత్తయ్య ఊరెళ్లొస్తాను వదినా!"

"అదేమిటి? వుండి వుండి అత్తయ్య జ్ఞాపకం వచ్చిందేమిటి నీకు?"

"ప్రతి వుత్తరంలోనూ రమ్మని రాస్తుందికదా? అందుకు!"

"అత్తయ్య రాస్తుందా? లేక...."

"ఛీ వదినా! నువ్వు మరీను."

"అదా సంగతి! అందుకే ఈ మధ్య అంత పరాకుగా వుంటున్నావు!"

"బావకోసం నేనేం దేవిర్లాడలేదు. అత్తయ్యను చూడాలని వెళ్తున్నానంతే!" అంది శ్రీలత చిరుకోపంతో.

"ఒకరోజు ఎలాగూ శాశ్వతంగా అక్కడికే వెళ్లాలి కదా....సర్లే, నీ మనసు నొప్పించి నేనెందుకు పాపం చుట్టుకోవాలి? ఇంతకీ, ఎప్పుడు ప్రయాణం?"

"రేపే!"

"ఐతే అర్జంటే కేసే నన్నమాట! మీ అన్నయ్య వచ్చాక అందరం కలిసే వెళదామనుకున్నాను. సమయానికి డ్రైవర్ కూడా లేడుకదా, జ్వరంవచ్చి ఇంట్లో పడుకున్నాడని ఇందాకే వాడి కొడుకు వచ్చి చెప్పాడు. ఎలా వెళతావ్ మరి?"

"నా కారు లేదూ? నాకు నడపడం రాదూ?"

"ఒంటరిగా వెళతావా?"

"విశాలాక్షిని తోడు రమ్మంటాను. ఎంత నెమ్మదిగా వెళ్ళినా నాలుగ్గంటల ప్రయాణమే కదా? ఉదయం

పదిగంటలకు రైలు చేరితే మధ్యాహ్నం రెండు గంటలకు చేరుకుంటా నక్కడికి!"

"సరే, నీ ఇష్టం వెళ్ళిరా!"

'హమ్మయ్య!' అనుకుంటూ భోజనాలయ్యాక తన గదిలోకెళ్ళి, స్నేహితురాలికి ఫోన్ చేసింది శ్రీలత.

"ఎవరూ?" వినిపించింది అవతలినించి ఆమె తల్లి కంఠం.

"నేనాంటీ, శ్రీలతని! విశాలాక్షి ఉందా ఇంట్లో?"

"ఆc! పిలుస్తానుండు."

రెండు నిమిషాల తరవాత విశాలాక్షి కంఠం వినిపించింది. "ఏమిటే లతా? రెండు రోజుల్నించీ కనిపించడం అటుంచి, కనీసం ఫోన్ కూడా చెయ్యలేదు?"

"వేరే పనుల్లో వుండిపోయానే! అది సరేగానీ, రేపు కార్లో మా అత్తయ్య వూరు తిరువాన్మూర్ వెళుతున్నాను. నిన్నుకూడా తీసికెళ్ళాలనుంది. ఏమంటావ్?"

"సారీ లతా! మా అన్నయ్య, అదే, హిప్నాటిస్టు! వారి ఫ్యామిలీ, మా ఫ్యామిలీ రేపు మహాబలిపురం వెళ్ళబోతున్నాం! విహారయాత్రకు. అయామ్ వెరీ సారీ, లేకుంటే నీ వెంట తప్పకుండా వచ్చేదాన్నే!"

నిట్టూర్చింది శ్రీలత. "మళ్ళీ యెప్పుడు వస్తారు మద్రాసు?"

"నాలుగు రోజుల తరవాత! నువ్వెప్పుడొస్తావ్?"

"బహుశా, పదిహేనురోజులు పట్టవచ్చు."

"అత్తయ్యను అడిగానని చెప్పు. అలాగే మీ శ్రీవారిని కూడా!"

"చాల్లే! ఉంటా మరి!" అంటూ రిసీవర్ దించేసింది, ఇంకా ఆగితే స్నేహితురాలు ఆటపట్టించడం ఖాయమని.

ఇక తను ఒక్కర్తే వెళ్ళక తప్పదు. విశాలాక్షి రావడంలేదని వదినకు చెబితే తనని ఒంటరిగా వెళ్ళ నివ్వదు. ఏదో ఒకటి బొంకక తప్పదు మరి!

9

"లక్ష్మయ్యా! ఆ సూట్ కేస్ తీసికెళ్ళి నా కార్లో పెట్టు!" అంది శ్రీలత రిస్టువాచీ చూసుకుంటూ. ఉదయం పదిగంటలు.

"బైలుదేరుతున్నావా?" అడిగింది అప్పుడే పైకి వస్తున్న వదిన.

"ఔను వదినా! మురళి ఎక్కడ?"

"కింద వున్నాడు. విశాలాక్షి ఇంకా రాలేదేం?"

"తన ఇంటికెళ్ళి నేనే రిసీవ్ చేసుకుంటాను. ఇక బైలుదేరనా?"

"సరే, అత్తయ్యకూ మామయ్యకూ నా నమస్కారాలు చెప్పు. అలాగే, మీ ఆయన్ని అడిగానని చెప్పడం మరవక!"

ఎరుపెక్కిన చెక్కిళ్ళతో చరచర మెట్లు దిగి హాల్లో కెళ్ళింది శ్రీలత. ఆమెని చూడగానే, "అంటీ, నేనూ వస్తా!" అంటూ చుట్టేశాడు మురళి.

"అలా వెళ్ళి ఇప్పుడే వస్తాగా! ఏం తెమ్మంటావ్ నీకోసం?"

"ఎగిరే ఎలికాప్టర్!"

"సరే, తప్పకుండా తెస్తాను. టాటా!"

"తాతా!"

"వస్తాను వదినా! అన్నయ్య వచ్చాక, ఇద్దరూ రండి. తిరిగి అందరం కలిసి వచ్చేద్దాం!"

తలూపింది వదిన. "కార్లో పెట్రోలు చూసుకు

న్నావా?"

"చూశాను. పోయించాలి. దార్లో టాంకు నింపు కుంటాలే!" అంటూ కారెక్కి ముందుకు పోనిచ్చింది శ్రీలత.

నగరం పొలిమేరలు దాటుతుండగా యెదురైన పెట్రోల్ బంక్ లో టాంకు నింపుకుని, తిరువాన్మూర్ వెళ్ళే మెయిన్ రోడ్డుపై పరిగెత్తించింది కారును.

పన్నెండు గంటల ప్రాంతంలో సుమారు యాభై మైళ్ళ ప్రయాణం పూర్తయ్యాక, దూరాన చిన్న పట్టణం కనిపించసాగింది. అది వడివేలూర్!

అక్కడికి చేరగానే కాస్త టిఫిన్ చేసి, కాఫీ తీసుకుని, కారు ఇంజన్ చల్లబడేవరకూ రెస్టు తీసుకోవాలి. అనుకుంటూ ఇరవై గజాల దూరంలో ఎదురైన రోడ్డు మలుపు తిప్పటానికి క్లచ్ వత్తి, గేర్ డౌన్ చేసింది. అంతే!

గురగుర శబ్దం చేస్తూ రెండుసార్లు కుదుపు ఇచ్చి, కారు ఇంజన్ ఆఫ్ అయింది. గతుక్కుమంది శ్రీలత! ఉన్న కొద్ది స్పీడ్ లో వెంటనే కారును రోడ్డు కెడంవైపు తీసి కెళ్ళి బ్రేక్ వత్తేసింది. గేర్ న్యూటల్ చెయ్యకుండా డోర్ తెరిచి దిగి, బాయ్ నెట్ ఎత్తి చూసింది. సన్నని ఆవిర్లు వస్తున్నాయి ఇంజన్ లోంచి.

పావుగంటపాటు అటూ యిటూ తొంగిచూసింది. డిఫెక్టు ఏమిటో ఓపట్టాన బుర్రకు తట్టలేదు. కారు నడపడం తప్ప దాని లోపాలు కనిపెట్టగలిగే పరిజ్ఞానం లేదు! ఇప్పుడేం చెయ్యాలి? కనీసం వడివేలూర్ చేరినా ఏదో ఒక సహాయం దొరికేది.

అనుకుంటూ చుట్టూ కలయజూసింది. దూరాన

ఓ లోడెడ్ లారీ వస్తూ కనిపించింది, దాన్నాపి, వారి సహాయం కోరాలి. రోడ్డుమధ్య నిల్చుని ఎదురుచూడ సాగింది. లారీ దగ్గరికి రాగానే చెయ్యెత్తి వూపింది.

"ఎన్నాచి?" అడిగాడు డ్రైవర్ బ్రేక్ వేస్తూ తమిళంలో.

చెప్పింది తన అవస్థ!

కష్టంలోవున్న అందమైన అమ్మాయి సహాయంకోరితే, కాటికి కాళ్ళు చాపుకున్న ముసలాడిలోనూ ఉత్సాహం ఉరకలు వేస్తుంది మరి!

డ్రైవర్, క్లీనర్ ఇద్దరూ లారీలోంచి ఛెంగున దూకి, ఆమె కారుని సమీపించారు. పదినిమిషాలు ఆ పార్టూ, ఈ పార్టూ తడిమిచూశారు. డిఫెక్టేమిటో వారికీ అర్థం కానట్టుంది.

డ్రైవర్ పెదవి విరిచి, "డిఫెక్టుదాం ఇంజన్‌లోనే వుండాది! టాపిట్ కవర్ విప్పి చూసేగానీ, ఏమీ తెలియాదు. అదుగో, వడివేలూర్ దగ్గర్లోనే వుండేది. అక్కడ చిన్న మోటార్ వర్క్‌షాప్ గూడా ఉండాది. తీసికెళ్ళి చూపండి" అన్నాడు.

"అక్కడివరకూ కారు ఎలా తీసికెళ్ళాలి?" అడిగింది శ్రీలత నిరుత్సాహంగా.

"మేమ్దా వుండాంగా" అంటూ క్లీనర్ వైపు తిరిగి, "అదేయ్ తంబీ! టోచన్ రోబ్ కొండువా!" అన్నాడు డ్రైవర్.

కుర్రాడు పరిగెత్తి, లారీలోంచి టోచన్ రోబ్ తీసుకొచ్చాడు. లారీ వెనక కొక్కానికి దాన్ని బిగించి రెండో చివరను కారు బంపర్ హుక్‌లో ఇరికించాడు.

"ఇపిదాం మీరు కార్లో ఉంకారు. నేను లారీ తోల్తా!" అన్నాడు డ్రైవర్.

బ్రతుకుజీవుడా అనుకుంటూ కారు ఫ్రంట్ డోర్ తెరిచి, స్టీరింగ్ ముందు కూర్చుంది శ్రీలత. లారీ నెమ్మదిగా ముందుకుసాగింది కారును లాగుతూ. అరగంట తరవాత రెండు వాహనాలూ వడివేలూర్ చేరుకున్నాయి.

లారీ డ్రైవర్ ఆమె కారుని ఊరిమధ్య వర్క్షాప్ దగ్గరాపి, టోచన్ ఊడదీశాడు.

"రొంబ థాంక్స్ తంబీ! ఇంద!" అంటూ పర్సులోంచి పదిరూపాయలనోటు తీసి అతని చేతిలో పెట్టింది శ్రీలత.

"కారు ట్రబులా మేడమ్?" అంటూ పరిగెత్తుకొచ్చారు వర్క్షాప్ మెకానిక్, హెల్పర్లు. తలూపి, "చూసి సరిచెయ్యండి. ఆలోగా ఊళ్ళోకెళ్ళొస్తాను" అంది శ్రీలత.

మెకానిక్ కారు బాయ్నెట్ ఎత్తి చూడసాగాడు.

ఊళ్ళోకి బైలుదేరింది శ్రీలత. అటు మరీ పెద్దదీకాని, ఇటు చిన్నదీకాని మధ్యరకం ఊరది. సెంటర్లో ఒకే ఒక పెద్ద హోటల్ కమ్ లాడ్జింగ్ వుంది. మధ్యాహ్నం ఒకటింబావు అవుతోంది సమయం!

లైట్ టిఫిన్ ఏమైనా తీసుకోవాలి అనుకుంటూ ఆ హోటల్లోకి నడిచింది శ్రీలత. టిఫిన్ చేసి, కాఫీతాగి బైటపడేసరికి రెండయింది. కారు పాడవకుంటే ఈపాటికి తిరువాన్మూర్ చేరేదే!

అనుకుంటూ వర్క్షాప్ వైపు నడిచింది. అక్కడికెళ్ళి చూస్తే మెకానిక్ అతని హెల్పర్ పుత్రాళ్ళూ కారు ఇంజన్లోని రెండు మూడు పార్టులు వూడదీసి,

పనిముట్లతో తంటాలు పడుతూ కనిపించారు.

ఆమెని చూడగానే మెకానిక్ మొఖంమీద చమట తుడుచుకుని, "గేర్ బాక్స్ చెడిపోయింది. క్లచ్ ప్లేట్ కాలిపోయిందమ్మా! కూర్చోండి. కాసేపట్లో రెడీ అవుతుంది కారు" అన్నాడు.

డోర్ తెరిచి, ఫుస్సూరుమంటూ కార్లో కూర్చుంది శ్రీలత. సీటు వెనక తలవాల్చింవో లేదో కొద్దిగా కునుకు పట్టేసింది.

10

"అమ్మగారూ! అమ్మగారూ!" అన్న పిలుపు విని తృళ్ళిపడి కళ్ళు తెరిచింది.

హెల్పర్ కుర్రాడు.

"క్లచ్ ప్లేట్ మార్చి, గేర్ బాక్స్ దిగించాం! కాస్త దిగుతారా? ట్రయల్ చూసి ఓ.కే. చేస్తాను" అంటున్నాడు మెకానిక్.

కారు దిగి చేతిగడియారం చూసుకుంది. ఐదుంబావు! మై గాడ్!!

"ఇంతసేపెందేం?" అంది కుంగారుగా.

"ఏం చెయ్యాలమ్మా! ఈ కుర్రాళ్ళతో ఛస్తున్నాను వేగలేక!" అన్నాడు మెకానిక్ స్టీరింగ్ ముందు కూర్చుంటూ.

ట్రయల్ చూసి, నట్ బోల్టులన్నీ మరోసారి చెక్ చేసి ఓ.కే. అనేసరికి సాయంత్రం ఆరుగంటలు దాటింది. ముందే చలికాలం! ఆరుగంటలకే చీకట్లు చుట్టేశాయి పరిసరాలని. ఏం చెయ్యాలి? ఇప్పుడు బైలుదేరితే, ఎనిమిదవుతుంది తిరువాన్మూర్ చేరడానికి. పగలైతే ఫరవాలేదు.

రాత్రిపూట ఒంటరిగా నిర్జనమైన రోడ్డుపై ప్రయాణమంటే చచ్చే భయం తనకు. మెరుపులా ఓ పరిష్కారం స్ఫురించిందామెకు. ఆ హోటల్ కెళ్ళి బావకు ట్రంకాల్ చేసి, వచ్చి తనని తీసికెళ్ళమని చెబితే? అదే బెస్టు ఐడియా!

అనుకుంటూ మెకానిక్ కు రిపేరింగ్ ఛార్జి ఇచ్చేసి, హోటల్ కు బైలుదేరింది. అప్పటికే ఊళ్లో వీధిదీపాలు వెలిగాయి. హోటల్ ఆవరణలో కారాపి, "తిరువాన్కూర్ ట్రంకాల్ చెయ్యాలి" అంది కౌంటర్ క్లర్కుతో.

"సారీ మేడమ్! ఉదయంనించీ ఆ లైన్ ఔటాఫ్ ఆర్డర్లో వుంది. బహుశా రిపేరింగ్ నడుస్తుందేమో!" అన్నాడతను.

నిలువునా నీరు గారిపోయింది ఆమె ఉత్సాహం! అటు మద్రాసూ వెళ్ళలేకా, ఇటు తిరువాన్కూరూ చేరలేకా అడక త్తెరలో పోకచెక్కలా అయింది తన స్థితి. ఇక ఆ రాత్రి ఆ హోటల్లో బసచెయ్యడం తప్ప మరో మార్గం కనిపించడంలేదు.

"ఏదైనా రూం వుందా ఖాళీగా?" అడిగింది.

"వుంది! పదిరూపాయలు రోజుకి" అంటూ రిజిష్టర్ ఆమె ముందుకు తోశాడతను.

తన వివరాలు రాసి, సంతకం పెట్టి, అడ్వాన్స్ ఇచ్చేసింది.

"నాలుగో నెంబర్ గది!" అంటూ కుర్రాణ్ని కేకేసి, "కార్లోంచి అమ్మగారి సామానులు తెచ్చి గదిలో పెట్టు!" అన్నాడు క్లర్కు తాళంచెవి అందిస్తూ.

వాడు డిక్కీలోంచి సూట్ కేస్ తెచ్చి, "రండమ్మా!"

అంటూ లోపలికి నడిచాడు ప్రసాదు. కింది భాగంలోనే ఓ చివర వుంది గది. తాళం తెరిచి లోన అడుగుపెట్టింది.

ఓ పక్క మంచం, పరుపూ, ఓ మూల స్టూలుమీద నీళ్ళకూజా వున్నాయి. పక్కనే చిన్న బాత్‌రూం, లావెట్రీ! తలుపు కభిముఖంగా గోడలో పెద్ద కిటికీ వుంది. దళసరి అద్దాల కిటికీ!

ప్రసాదు కూజాలో నీళ్ళునింపి వెళ్ళగానే తలుపు మూసి, పై గడియా కింద గడియా బిగించి, కిటికీ బోల్టులు కూడా పరీక్షించి, నిట్టూరుస్తూ మంచంమీద కూలబడింది.

ఒంటరితనంవల్ల ఆమె కళ్ళల్లో పదేపదే జగన్నాథం రూపమే కదలసాగింది. ఈ అవస్థలన్నీ అతని మూలానే దాపురించాయి తనకి. అతని గురించి తాను భయపడుతున్నట్టే, అతనూ తన గురించి భయపడుతున్నాడేమో!

ఇక ఆ హత్య విషయం నేను మర్చిపోతాను. దాని గురించి ఎవరికీ ఏమీ చెప్పను. నీ స్వంత విషయాల్లోకి ఇంకెప్పుడూ జోక్యం చేసుకోను. అని అతని మెదడుకి మెసేజ్ పంపితే? నమ్ముతాడా? తనని వదిలిపెడతాడా?

“వదిలిపెట్టను. ఎట్టి పరిస్థితిలోనూ వదిలిపెట్టను!”

అదిరిపడి లేచి నిల్చుంది లత! తన ఆలోచనలకి జవాబుగా అతని కంఠం మారుమోగింది మదిలో! అంటే అంటే.... చటుక్కున గదిలోని లైటార్పి, తడుముకుంటూ కిటికీని సమీపించింది.

సవ్వడికాకుండా కిటికీ బోల్టులుతీసి, నెమ్మదిగా ఓ రెక్క తెరిచి పక్కకి చూసింది. హోటల్ ముందు భాగాన కాంపౌండ్లో వెలుగుతున్న లైటు కాంతిలో, బైట పార్క్ చేసి వున్న తన కారు స్పష్టంగా కనిపిస్తోందామెకు.

కారు దగ్గర నిల్చుని, దాన్ని పరీక్షగా చూస్తున్నాడో వ్యక్తి! అతన్ని పోల్చుకోగానే శ్రీలత గుండె ఝల్లుమంది! జగన్నాథం! తన ఆలోచనల్ని చదువుతూ, వెంబడిస్తూ చేరుకున్నాడా ఇక్కడికి? తను ఈ హోటల్లో ప్రవేశించిన మరుక్షణం, ఫోటో తీసినట్టు హోటల్ ప్రతిబింబం అతని మస్తిష్కంలో ప్రతిఫలించి వుంటుంది. వచ్చేశాడు సులభంగా.

ఇప్పుడు కారు తనదా, కాదా అని తెలుసుకోడానికి పరీక్షిస్తున్నాడు. అనవసరంగా కాలయాపన చేస్తూ అక్కడే నిల్చుంటే కాసేపట్లో తనకు మరణం తథ్యం! పారిపోవాలి తక్షణం అక్కణ్ణించి పారిపోవాలి.

ఆ ఆలోచన రాగానే అంతరాత్మ హెచ్చరించిందామెను. పిచ్చిదానా! పథకాలు వెయ్యక. మరుక్షణం అతనికి తెలిసిపోతుంది. ఇక ఏమీ ఆలోచించకు. నీ మెదడును ఖాళీగా వుంచు. శరీరాన్ని దాన్ని మానాన వదిలెయ్యి.

11

కిటికీ రెక్క కొద్దిగా తెరిచి, మళ్ళీ తొంగిచూసింది. జగన్నాథం సాలోచనగా తలూపుతూ కారు దగ్గర్నించి హోటల్ సింహ ద్వారంవైపు వెళుతున్నాడు. కిటికీ పూర్తిగా తెరిచింది లత. అదృష్టవశాత్తూ దానికి మధ్యలో రెండు చువ్వలు లేవు.

నెమ్మదిగా అందులోంచి దూరి, బైటికి దిగగలిగింది. ఆలస్యం చెయ్యకుండా పక్కనే వున్న కంపౌండ్ పిట్టగోడ ఎక్కి, అవతలకి దూకి పరుగుతీసింది. చలికాలం కావడంవల్ల వీధిలో మనుషులటుంచి, కుక్కలు కూడా కానరావడం లేదు. పైన మబ్బుతునక లేని ఆకాశం! దానిపై

చలిని ద్విగుణీకృతంచేస్తూ నిండుగా వెలిగిపోతున్న పౌర్ణమి చంద్రబింబం!

మాటిమాటికీ వెనుదిరిగి చూస్తూ మెయిన్ రోడ్డువైపు పరుగుతీస్తోంది శ్రీలత. ఐదునిమిషాల తరవాత చేరుకుంది రోడ్డుమీదికి. సరిగ్గా అదేక్షణంలో మద్రాసువైపునించి ఏదో వాహనం వస్తున్నట్లు హెడ్ లైట్స్ కనిపించసాగాయి.

ప్రాణం లేచివచ్చి, వాహనం దగ్గరికి రాగానే చెయ్యి ఊపింది. సడన్ బ్రేక్ వేశాడు డ్రైవర్.

"అర్జంటుగా తిరువాన్కూర్ వెళ్ళాలి. తీసికెళ్తారా నన్ను?" అడిగింది ప్రాధేయపడుతూ.

రెండు నిమిషాలు సందేహంగా చూసి, తరవాత తలూపాడు డ్రైవర్. అతని పక్కసీట్లో కూర్చున్న క్లీనర్ని వెనక బాడీలో కూర్చోమని, "రండి. ఎక్కండి త్వరగా!" అన్నాడు.

క్లీనర్ కుర్రాడు వెనబాడీలో కెళ్ళిపోయాడు. శ్రీలత డ్రైవర్ పక్కసీట్లో కూర్చుంది. లారీలో ప్రయాణించడం తన జీవితంలో ఇదే ప్రథమం! ఆ ఆలోచన రాగానే మళ్ళీ ఆమెను హెచ్చరించింది మనసు.

నీ గోతిని నువ్వే తవ్వుకుంటున్నావు. నువ్వు లారీ ఎక్కి తిరువాన్కూర్ పారిపోతున్నావని అరక్షణంలో పసిగట్టగలడు జగన్నాథం! ఇవి ఆలోచనలు కావు. నీ పాలిటి మృత్యుతరంగాలు!!

అందుకే, ఎటువంటి ఆలోచనలూ పెట్టుకోకుండా నీ బుర్రను ఖాళీగా వుంచుకో. లారీలో ప్రయాణిస్తూ నువ్వు చూసే ప్రతి దృశ్యం అతని మనోఫలకంపై ప్రతిఫలిస్తుంది. ఆ విధంగా అతను నీ ప్రయాణ దిశను సుల

భంగా గ్రహించగలడు.

అందుకే, ప్రయాణం అంతమయ్యేవరకూ నీ కళ్ళు మూసుకో. ఏమీ చూడకు. మరేమీ ఊహించకు! ఆ ఆలోచన రాగానే సీటు వెనక తల ఆనించి, కళ్ళు మూసుకుంది శ్రీలత. లారీ శరవేగంతో దూసుకుపోతోంది రోడ్డుమీద.

'ఎక్కడికెళ్ళిపోయావు లతా?' తృళ్ళిపడి కళ్ళు తెరిచి చూట్టూ కలయచూసింది.

డ్రైవర్ లారీ నడపడంలో పూర్తిగా నిమగ్నమై వున్నాడు. ఐనా, అతనికి తన పేరెలా తెలుసు? మరి ఎవరు పిలిచారు తనని? ఎవరు సంబోధించారు? మరు క్షణం అర్థమైపోయిందామెకు ఆ సంబోధన ఎవరిదో! జగన్నాథం!

కళ్ళల్లో అతను స్పష్టంగా కనిపిస్తున్నాడిప్పుడు. ఆ హోటల్లోని తన గది కిటికీ బైట నిల్చుని ఆ కిటికీ రెక్కలు మూయకుండా వదిలేసి, పెద్ద తప్పుచేసింది తను. కిటికీ ఎక్కి నెమ్మదిగా అంధకారం నిండిన ఆ గదిలోకి దిగుతున్నాడు జగన్నాథం! జేబులోంచి పెన్సిల్ టార్చితీసి, వెలిగించి, గది నాలుగు మూలలూ వేసి పరీక్షగా చూస్తున్నాడు. దాని వెలుగు ఖాళీ మంచం మీదికి ప్రసరించి ఆగిపోయింది.

'మన ఆలోచనా తరంగాల సంబంధం కొనసాగుతూనే వుంది లతా! వాటి ఫ్రీక్వెన్సీనించి తప్పించుకోడం నీవల్లా, నావల్లా ఇద్దరివల్లా సంభవం కానిపని. నేనెక్కడున్నానో నీకు తెలుస్తూనే వుంది. అలాగే ఇప్పుడు నువెక్కడున్నావో నేనూ గ్రహించగలను.

నానించి తప్పించుకుని నువ్వెక్కడికీ పోలేవు.

అదంత సులభమైన పనికాదు. శరవేగంతో ప్రయాణిస్తున్న ఏదో వాహనంలో కూర్చుని, దాని హెడ్ లైట్స్ కాంతిలో నువ్వు చూస్తున్న రోడ్డును నేను చాలా స్పష్టంగా అవగాహన చేసుకోగలుగుతున్నాను.

పోలీసులకు నా గురించి చెప్పి నువ్వు పెద్ద పొరపాటు చేశావు లతా! నీ గోతిని నీ చేతులా నువ్వే తవ్వుకున్నావు. నా స్వంత విషయాల్లో అనవసరంగా జోక్యం చేసుకున్నావు. నువ్వు నా స్నేహితుడి చెల్లెలివి. మొదటినించీ నీపట్ల నాకు అభిమానం వుంది.

నా భార్యను ఏ పరిస్థితిలో చంపవలసి వచ్చిందో నీకు బాగా తెలిసివుండీ, నామీద జాలిపడటానికి బదులు నన్ను ఉరికంబం యెక్కించడానికి ప్రయత్నించావు. తప్పంతా నీదే! ఆ తప్పుకు తగ్గ శిక్ష ఇప్పుడు అనుభవించక తప్పదు. సులోచన మధుసూదన్ తో అక్రమ సంబంధం పెట్టుకుని ఏ తప్పైతే చేసిందో దానికి తగ్గ శిక్ష అనుభవించింది!'

ఉలిక్కిపడింది శ్రీలత. ఆ రోజు పార్కులో సులోచన వెంట తాను చూసిన వ్యక్తి పేరు మధుసూధనా? అతని పేరూ, వివరాలూ తెలిస్తే జగన్నాథ్ నేరాన్ని ఋజువు చెయ్యడానికి తగిన ఆధారాలు లభిస్తాయని చెప్పాడు ఇన్ స్పెక్టర్ యుగంధర రెడ్డి.

అప్పుడతని పేరు తనకు తెలీదు. ఇప్పుడు తెలిసింది. కానీ, ఏం లాభం? అలా ఆలోచిస్తున్నందుకు తననితాను తిట్టుకుంది శ్రీలత. ఇంతవరకూ తన కా వ్యక్తి పేరు తెలుసేమో అనుకుంటున్నాడు జగన్నాథం! ఈ విధంగా తను చేసిన పొరపాటేమిటో అతని కర్థమైపోతుంది. దాంతో, తనని ప్రాణాలతో వదలడం చాలా ప్రమాద

మని భావిస్తాడు! చంపితీరతాడు!

'ఔను. ఇప్పుడు నిన్ను తుదముట్టించక తప్పదు లతా! వాడి పేరు నీకు తెలిసిపోయింది. పోలీసులకు చెబుతావ్! ఆ విధంగా వారు కోర్టులో నామీద హత్యాభియోగం మోపడం చాలా సులభమౌతుంది.'

'లేదు. నేనెవ్వరికీ చెప్పను. బుద్ధొచ్చింది. ఇక మీ వ్యక్తిగత విషయాల్లో కలగజేసుకోనని ప్రమాణ పూర్వకంగా చెబుతున్నాను' అనుకుంది శ్రీలత.

'సారీ, ఆయామ్ వెరీ సారీ! నాకు మనుషులమీద ముఖ్యంగా ఆడవారిమీద నమ్మకం పూర్తిగా పోయింది లతా....'

సడన్ బ్రేక్‌తో లారీ ఆగిన చప్పుడు విని, తిరువాన్కూర్ వచ్చేసిందా? అనుకుంటూ చటుక్కున రోడ్డు మీదికి చూసింది శ్రీలత. హెడ్ లైట్స్ వెలుగులో రోడ్డుపక్క పాతివున్న వెడల్పాటి మైలురాయి చూసి ఆశ్చర్యపోయింది.

తిరువాన్కూర్—35 మైళ్ళు.

మరి లారీ ఎందుకాగింది? అనుకుంటూ డ్రైవర్ వైపు చూసింది. గారపళ్ళికిలిస్తూ వెకిలిగా నవ్వుతున్నాడు. ఆ నవ్వు కర్థం ఏమిటో ఆడవారికి బాగా తెలుసు. గుండె ఝల్లుమంది శ్రీలతకు.

"ఎందుకాపావు లారీ?" అడిగింది ధైర్యం చిక్కబట్టుకుని.

"ఇంకెందుకు? బైట విరగాస్తున్న పండు వెన్నెల. పక్కన అందమైన పిల్ల. పైగా చలికాలం! వెచ్చదనం కావాలంటున్న శరీరం! రా ఇలా!" అంటూ ఆమె చెయ్యందుకోబోయాడు డ్రైవర్.

12

అప్పటికే డోర్ పిడి తిప్పేసింది శ్రీలత. రెప్ప పాటులో డోర్ తీసి బైటికి దూకేసింది!

"ఎక్కడికి పోతావ్? ఈ చిట్టడవిలో ఎవడు నిన్ను కాపాడేది? బెట్టు చెయ్యక!" అంటూ తనూ కిందికి దూకాడు డ్రైవర్.

గావుకేకలు పెడుతూ పొదలమధ్యపడి పరుగుతీసింది శ్రీలత. ఆమె అరుపులు అరణ్యరోదనలే అయ్యాయి. ఎన్నడూ అలా పరిగెత్తి ఎరగదు. ఆ మిట్టపల్లాల్లో, రాళ్ళూ రప్పల్లో పరిగెత్తడం ఆమెకు సాధ్యపడటంలేదు. చీర అడ్డు తగిలి బోర్లా పడిపోయింది నేలమీద!

"చెప్పలా, బెట్టు చెయ్యొద్దని!" అంటూ సమీపించాడు డ్రైవర్.

అంతే! ఒక్క ఉదుటున లేచి నిల్చుంది రొప్పుతూ. చిఱుతలా లంఘించి ఆమెని చుట్టేశాడు డ్రైవర్. చీర కుచ్చెళ్ళుపట్టి లాగుతున్నాడు. ప్రాణంకన్నా మూల్యమైనది. పోతే తిరిగిరానిది. కాసేపట్లో కోల్పోతుంది తను.

చివరి క్షణంలో తెగింపు వచ్చేస్తుంది ఏ ప్రాణికైనా! శక్తినంతా కూడదీసుకుని ఒక్క తోపు తోసింది వాణ్ణి. వెనక్కి తూలాడు. మెరుపులా నేలమీంచి రాళ్ళందుకుంది. మళ్ళీ మీదపడబోతున్న వాడికి గురిపెట్టి విసిరింది గట్టిగా.

"ఠప్!"మన్న శబ్దంతో వాడి తలను గుద్దుకుంది రాయి. "అ.... మ్మో!" అంటూ నుదురు పట్టుకున్నాడు.

"చంపేస్తాను. పచ్చి నెత్తురు తాగుతాను. పారిపో! వెంటనే పారిపో ఇక్కణ్ణించి" పిచ్చిగా అరుస్తూ మరో

రాయి విసిరింది.

వెనుదిరిగి పరుగులంకించాడు డ్రైవర్. వెనకనించి రాళ్ళ వర్షం ఆపలేదు లత. రెండు నిమిషాల తరవాత, రోడ్డుమీద స్టార్టయి వేగంగా వెళ్ళిపోతున్న లారీ శబ్దం వినిపించింది. తన నిస్సహాయ స్థితికి దుఃఖం కట్టలు తెంచుకుంది ఆమెలో.

వెక్కి వెక్కి ఏడుస్తూ జారిపోయిన చీర కట్టుకుని, కూలబడిపోయిందక్కడే. ఏం చెయ్యాలిప్పుడు? ఈ నిర్జన ప్రదేశంలో ఎలా గడపాలి? మర్నాటి సూర్యోదయాన్ని చూడగలదా తను? చెట్లమధ్యా, పుట్టలమధ్యా పడుంటం ప్రమాదం!

మాంసాహార మృగాలు రాత్రిపూటే సంచరిస్తుంటాయి అడవిలో. కీటకాలని వేటాడుతూ విష సర్పాలూ విహరిస్తుంటాయి పెద్ద సంఖ్యలో. ఇక రోడ్డే ఈ అరణ్యంలో తనకు శరణ్యం!

అక్కడ నిల్చుంటే, ఏ వైపునించైనా ఏదో ఒక వాహనం రాకపోదు. ఇప్పటి చేదు అనుభవం దృష్ట్యా ఇక లారీల జోలికి పోవద్దు. సంస్కారం వున్న చిన్న వాహనాల వార్ని సహాయం అర్థించాలి. అనుకుంటూ నెమ్మదిగా లేచి, వస్సిపోయిన అడుగులతో రోడ్డువైపు నడిచింది.

రోడ్డుమీదికి చేరిన ఐదునిమిషాల తరవాత దూరాన మద్రాసు వైపునించి ఏదో వాహనం వస్తునట్టు హెడ్ లైట్స్ కనిపించసాగాయి. ఆశగా అటే చూడసాగింది.

దగ్గరవుతున్న కొద్దీ హెడ్ లైట్స్ యెడాన్నిబట్టి అది చిన్న వాహనమే అని అంచనా వేసుకుంది శ్రీలత. రోడ్డు చేరువలో నిల్చుని చెయ్యి ఊపసాగింది.

వాహనం స్పీడ్ స్లో అయింది. నెమ్మదిగా వచ్చి ఆమె పక్కన ఆగింది.

అది జోంగా జీప్!

13

డ్రైవింగ్ సీట్లో కూర్చున్న జగన్నాథంని చూడగానే భయంతో గావుకేకలు పెడుతూ వెనుదిరిగి మళ్ళీ అరణ్యం లోకి పరుగుతీసింది లత! అంతక్రితం జరిగిన సంఘటనవల్ల ఆతని సంగతే మర్చిపోయింది తను. లారీ దిగుతూ తాను చూసిన మెయిలురాయిద్వారా, తన ఉనికిని ఇట్టే పసిగట్టి వుంటాడు.

పిల్లి పంజాలోంచి తప్పించుకుని, ఇప్పుడు పులి నోట్లో ఇరుక్కుంది! భగవంతుడా, ఇక నువ్వే నాకు దిక్కు. దేవుణ్ని తలుచుకుంటూ శక్తినంతా కళ్ళల్లో కూడ దీసుకుని ముళ్ళకంపల్ని ఎత్తుపల్లాలనీ లెక్క చెయ్యకుండా పరిగెత్తుతూంది శ్రీలత. వెనక జీపు నెమ్మదిగా రోడ్డుదిగి అడవివైపు వస్తున్న చప్పుడు.

అది జోంగా జీప్! ఎటువంటి అవరోధాలనైనా అవలీలగా దాటుకుంటూ ముందుకు సాగడం దాని ప్రత్యేకత! అదృష్టవశాత్తూ పైన పిండారబోసినట్టు వెలుగుతున్న వెన్నెల వెలుగులేకుంటే చిమ్మ చీకట్లో తన పరిస్థితి మరీ నికృష్టంగా వుండేది. చెట్ల ఆకుల్ని చీల్చుకుంటూ నేలను తాకుతున్న ఆ వెలుగులో చూసు కుంటూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని పరిగెత్తుతోంది శ్రీలత.

అప్పటికే చాలా దూరం చేరుకో గలిగింది. ఇప్పుడు చెట్ల గుబురు తగ్గి విశాలమైన స్థలం వచ్చేసింది. అప్పుడు కనిపించిందామెకు దూరాన ఏదో మెరుస్తూ! ఏమిటది?

ఏదైనా ఊరుందా అక్కడ? లేక, ఎవరైనా వేటగాళ్ళు టార్చి వేస్తున్నారా? కాలి చెప్పులు తెగి తూలిపడబోతూ నిలదొక్కుకుంది.

వెనక జీపు దగ్గరవుతున్న శబ్దం! చెప్పుల్ని దూరంగా విదిలించి, ఆ వెలుగు కనిపిస్తున్నవైపు దౌడుతీసింది. రాళ్ళూ, రప్పలూ తాకి వేళ్ళు చిట్లిపోతున్నాయి. పాదాలు ముళ్ళధాటిని తట్టుకోలేకపోతున్నాయి. అవేమీ లెక్క చెయ్యడంలేదు. ప్రాణ ప్రీతి అలాంటిది మరి!

ఫర్లాంగు దూరం వెళ్ళాక అర్థమైందామెకు ఆ వెలుగేమిటో! నిండుగా నది ప్రవహిస్తోందక్కడ! నింగిలో కాంతులీనుతున్న చంద్రబింబం ఆ నది నీటిలో ప్రతిఫలించి మెరుస్తోంది తళతళ! నిలువునా నీరు గారిపోయింది ఆమె ఆశ!

మరుక్షణం ఆమె ఆశను మళ్ళీ చిగురింపజేస్తూ కొద్ది దూరాన నదిపైన కనిపించింది వంతెన! ఔను. అది వంతెనే. దానిమీంచి సాధ్యమైనంత త్వరగా నది అవలి ఒడ్డుకు చేరుకోవాలి అనుకుంటూ అటు పరిగెత్తింది శ్రీలత.

ఆ వంతెన్ని సమీపించిందో లేదో, వెనక హెడ్ లైట్స్ వెలుగు నూటిగా పడింది ఆమెమీద. వచ్చేసింది జీపు. ఆలస్యంచేస్తే తన మరణం తథ్యం! భయంవల్ల కాళ్ళు వణుకుతూ అడుగులు తడబడుతున్నాయి. ఇప్పుడు చెట్లూ పుట్టలూ అడ్డులేవు గనుక శరవేగంతో వస్తోంది జీపు.

కొన ఊపిరిని కూడదీసుకుంటూ వంతెన్ని సమీపించి, దానిమీద అడుగువేసిందల్లా వాయువేగంతో వస్తున్న జీపుధాటికి భయపడి వంతెన పక్కనే వున్న పొదల్లోకి

దొర్లిపోయింది శ్రీలత.

అలా చెయ్యకపోతే, ఆ నాడు సులోచనను పట్టిన గతే ఆమెకూ పట్టేదే! ఆమె పొదల్లోకి దొర్లిన మరు క్షణం జీపు అదే వేగంతో వంతెనమీదికి దూసుకుపో యింది. అంతే! ఫెళ్ళుమన్న పెద్ద చప్పుడు వినేసరికి, ఆశ్చర్యంతో నేలమీంచి లేచి చూసింది లత.

నది మధ్య నీటిలో మునుగుతోంది జీపు!

వంతెనపై ప్రయాణిస్తున్న జీపు నది మధ్య యెలా పడిందా, అనుకుంటూ దిగ్భ్రాంతితో చేష్టలుడిగి అలాగే చూస్తూండిపోయింది శ్రీలత. ఆమె కళ్ళముందే పూర్తిగా మునిగిపోయింది జీపు నదిలో!

ఇప్పుడక్కడ బుడబుడ బుడగలు బైటికి వస్తు న్నాయి నీటిలో! ఆశ్చర్యాన్నీ, కుతూహలాన్నీ అణచు కోలేక, అడుగులో అడుగు వేసుకుంటూ వంతెనపై ముందుకు సాగింది లత.

పది గజాలు వెళ్ళాక అర్థమైపోయిందామెకు అసలు సంగతి! యెప్పుడో, బ్రిటిష్ కాలంలోనో కట్టిన అతి పురాతన వంతెన అయుండాలది. వరదల తాకిడికి దాని మధ్య భాగం యెప్పుడో కూలిపోయినట్టుంది. తాను దూరంనించి దాన్ని చూసి, సంపూర్ణమైన వంతెనే అను కుంది. మరుక్షణం ఆ ఆలోచన జగన్నాధానికి చేరి పోయింది.

తన భ్రమను అతను వాస్తవంగా భావించాడు. అందుకే అంత వేగంతో తనని ఢీకొట్టి చంపాలని వచ్చాడు. చివరికి తనే జలసమాధి అయి చచ్చాడు. అది పరిపూర్ణమైన వంతెన కాదని తాను ఏ మాత్రం గ్రహించినా అతను జీపు ఆపేసేవాడే!

ఏ తరంగాలు ఇంతవరకూ తనపాలిటి మృత్యువీచిక లయ్యాయో, అవే యిప్పుడు సంజీవినీ సరాగాలుగా సహకరించాయి తనకు. ఆ పీడకలనించి విముక్తిని కలిగించాయి. అంతా లీల! దైవలీల!!

తేలిగ్గా నిట్టూరుస్తూ, కాళ్ళకు తగిలిన గాయాలను మరుస్తూ మెయిన్ రోడ్డువైపు నడవసాగింది శ్రీలత. అప్పుడే తూరుపు దిక్కున తెలతెలవారసాగింది, ఇక ఆమె జీవితానికి ఏ భయమూ లేదని అభయమిస్తూ!

—: అయిపోయింది :—